మార్నింగ్ కాఫీ విత్ హాట్ న్యూస్‌తో...! మీ

# డ్రీమ్ టైమ్స్

తెలుగు దిన పత్రిక

శుక్రవారం 10-04-2026
పేజీలు: 8 వెల: రూ.2/-

సంపుటి:5 సంచిక 170

Published from Kurnool circulated all over Andhra Pradesh and Telangana All District

విలేకరులు కావలెను



తెలంగాణ ,ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా డ్రీమ్ టైమ్స్ దినపత్రికలో బ్యూరో, మండలాల రిపోర్టర్ గా పని చేయుటకు జిల్లాల, నియోజకవర్గ స్థాయిలో ఉత్సాహవంతులైన యువతి ,యువకులు కావలెను, కొత్త వారికి మరియు అనుభవం ఉన్నవారికి అవకాశం ఇవ్వబడును

8500066609


# పోలింగ్ ప్రశాంతం

## వేరువేరు చోట్ల ఓటు హక్కు వినియోగించుకున్న ప్రముఖులు

- పుదుచ్చేరిలో 86శాతం..
- అసోంలో 84.42శాతం..
- కేరళలో 77.45శాతం
- అసోంలో ఘర్షణలు : 30మందికి గాయాలు, ఏడుగురు అరెస్టు
- అసోంలో పోలింగ్ బూత్‌లో వీడియో : ఎఫ్ఐఆర్ నమోదు

**న్యూఢిల్లీ ఏప్రిల్ 9(డ్రీమ్ టైమ్స్):**
కేరళం, అసోం రాష్ట్రాల్లో, కేంద్ర పాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలో చెదురుమదురు ఘటనలు మినహా గురువారం పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మూడు చోట్లా భారీ సంఖ్యలోనే పోలింగ్ నమోదైంది. పుదుచ్చేరిలో 86శాతం, అసోంలో 84.42శాతం, కేరళలో 77.45శాతం మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. అస్సాంలో సాయంత్రం ఐదు గంటలకే పోలింగ్ ముగిసినా, కేరళ, పుదుచ్చేరిల్లో మాత్రం

-మిగతా 3 లో








## తుది ఒప్పందం వరకు ఇరాన్‌లోనే బలగాలు

- ఉల్లంఘనలు జరిగితే భారీ దాడులు
- అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరిక

**న్యూఢిల్లీ,**
కాల్పుల విరమణపై తుది ఒప్పందం కుదిరి అది పూర్తిగా అమలు జరిగే వరకు ఇరాన్ లోపల, చుట్టూ అమెరికా సైనిక బలగాల మోహరింపు కొనసాగుతుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గురువారం ప్రకటించారు. పశ్చిమాసియాలో కాల్పుల విరమణ పరిస్థితులు సంక్లిష్టంగా ఉన్న నేపథ్యంలో ఇరాన్‌పై ఒత్తిడిని కొనసాగించాలని ట్రంప్ భావిస్తున్నట్లు ఈ వ్యాఖ్యలు సూచిస్తున్నాయి. ఇప్పటికే గణనీయంగా బలహీనపడిన శత్రువును ఎదుర్కొనడానికి, నాశనం చేయడానికి అవసరమైన అదనపు మందుగుండు సామగ్రి, ఆయుధాలు, అన్ని అమెరికా నౌకలు, విమానాలు, సైనిక సిబ్బంది ఒప్పందం కుదిరి, పూర్తిగా అమలయ్యే వరకు ఇరాన్‌లోపల, దాని పరిసర ప్రాంతాలలోనే ఉంటాయి అని ట్రూత్ సోషల్‌లో ట్రంప్ తెలిపారు.అవగాహన ఉల్లంఘన తీవ్ర సైనిక ప్రతిస్పందనకు దారితీయగలదని ఆయన హెచ్చరించారు. ఏ కారణం చేతనైనా దీన్ని పాటించకపోతే అప్పుడు కాల్పులు మొదలవుతాయని, మునుపెన్నడూ ఎవరూ చూడనంత శక్తివంతమైనవిగా ఉంటాయని ట్రంప్ హెచ్చరించారు. అమెరికా కీలక లక్ష్యాలను పునరుద్ఘాటిస్తూ ఇరాన్ అణ్వాయుధాలు సంపాదించకూడదని, హెర్ముజ్ జలసంధి తెరిచి, సురక్షితంగా ఉండాలని ఆయన తెలిపారు.



## ఈడెన్‌లో ముకుల్ చౌదరి సునామీ..!

- ఐపీఎల్‌లో కొత్త హీరో ఆవిర్భావం
- లక్నోను గెలిపించిన ముకుల్ చౌదరి
- కేకేఆర్‌పై బ్యాటింగ్‌లో విధ్వంసం

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 9(డ్రీమ్ టైమ్స్):**
ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026లో లక్నో సూపర్ జెయింట్స్ జట్టు సంచలన విజయం సాధించింది. గురువారం ఈడెన్ గార్డెన్స్ వేదికగా కోల్‌కతా నైట్ రైడర్స్‌తో జరిగిన మ్యాచులో చివరి బంతికి విజయం సాధించింది. ఓ దశలో 182 పరుగుల లక్ష్య ఛేదనలో ఓటమి అంచున నిలిచిన ఆ జట్టు.. 21 ఏళ్ల ముకుల్ చౌదరి అసాధారణ బ్యాటింగ్‌తో గెలుపుగీతను దాటింది. దీంతో ఈ టోర్నీలో రెండో విజయాన్ని నమోదు చేసింది. మరోవైపు కేకేఆర్ నాలుగు మ్యాచులు ఆడినా.. ఒక్క విజయం కూడా సాధించలేకపోయింది. 182 పరుగుల ఛేజింగ్‌తో బరిలోకి

-మిగతా 3 లో

## బెంగాల్ మార్పు కోరుకుంటోంది..



- రాష్ట్రం అంతటా నందిగ్రామ్ ఫలితాలే
- భారత్ ఎంతో వేగంగా అభివృద్ధి చెందినప్పటికీ టీఎంసీ ప్రభుత్వం బెంగాల్ అభివృద్ధికి అడ్డుపడుతోంది
- బీజేపీ అధికారంలోకి రాగానే రాజ్యాంగం ప్రకారం టీఎంసీ చేసిన మోసాలను బయటకు తీస్తాం
- తృణమూల్ చేసిన పాపాలు వందేళ్లు గడిచినా తొలగిపోవు
- తృణమూల్ ప్రభుత్వంలో కుంభకోణాలకు, అవినీతికి పాల్పడిన వారిని జైలుకు పంపిస్తాం

3



## దీదీ ఆస్తులు అంతంత మాత్రమే

- చిర,చరాస్తులు కూడా లేవు
- సొంత ఇల్లు అంతకన్నా లేదు
- బ్యాంకులో కేవలం రూ.12.4లక్షల నగదు నిల్వ

3

## రాఘవ్ చద్దా కొత్త పార్టీ?!



**న్యూఢిల్లీ :**
ఆమ్ ఆద్మీ పార్టీ పక్కకు పెట్టిన ఆ పార్టీ రాజ్యసభ ఎంపీ రాఘవ్ చద్దా కొత్త రాజకీయ పార్టీని స్థాపించే సూచనలు కనిపిస్తున్నాయి! 'ఆసక్తికర ఆలోచన' పేరిట సామాజిక మాధ్యమాల్లో ఆయన షేర్ చేసిన వీడియో ప్రకారం వేరే పార్టీలో చేరే దాని కన్నా కొత్త పార్టీని స్థాపించడమే మేలన్న అభిప్రాయాన్ని ఆయన పంచుకున్నారు.సొంత పార్టీతో విభేదాలు పెరుగుతున్న వేళ ఆయన ఈ విషయాన్ని పంచుకోవడం గమనార్హం. చద్దా తనకున్న ప్రజా మద్దతును నిలబెట్టుకోవాలంటే కొత్త పార్టీని పెట్టడమే మేలన్న ఓ కంటెంట్ క్రియేటర్ వీడియోను ఆయన తన ఖాతాలో పంచుకున్నారు.

# ప్రజలకు సుపరిపాలన అందిస్తున్నాం


## 21 నెల్లోనే ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాం

- జగన్ పాలనలో వ్యవస్థలు గాడి తప్పాయి
- విభజన కన్నా జగన్ వల్లనే ఏపి నష్టపోయింది
- 'మీ భూమి-మీ హక్కు' కార్యక్రమంలో సిఎం చంద్రబాబు
- బాపట్ల జిల్లా సూరేపల్లిలో పట్టా పుస్తకాలు అందచేత



**బాపట్ల, ఏప్రిల్ 9(డ్రీమ్ టైమ్స్):**
ప్రజలకు సుపరిపాలన అందిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చామని..దానిని నిలబెట్టుకున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. 21 నెలల్లోనే ప్రజల జీవితాల్లో వెలుగులు నింపామన్నారు. ఎన్నికల్లో చెప్పనివి కూడా అమలు చేస్తున్నామని చెప్పుకొచ్చారు. వైసీపీ పాలనలో రాష్ట్రంలో విధ్వంసం జరిగిందని సీఎం విమర్శించారు.గురువారం భట్టిప్రోలు మండలం సూరేపల్లిలో పర్యటించిన సీఎం.. 'మీ భూమి-మీ హక్కు' కార్యక్రమంలో భాగంగా రైతులకు పాస్ పుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. విభజన కంటే వైసీపీ పాలనలోనే ఏపీకి ఎక్కువ నష్టం జరిగిందన్నారు. వైసీపీ హయాంలో మహిళలకు రక్షణ లేదన్నారు. జగన్ పాలనలో వ్యవస్థలు గాడి తప్పాయని.. దారిలో పెడుతున్నామని వెల్లడించారు. వైసీపీ హయాంలో ప్రజల భూములపై కన్నేశారని..

-మిగతా 3 లో





## జగన్.. మావిగన్ జోకర్

- వైఎస్ పేరును వాడుకున్నారు తప్పితే ఆయన ఆశయాలకు వారసుడు కాలేదు: షర్మిల

**అమరావతి, ఏప్రిల్ 9(డ్రీమ్ టైమ్స్):**
"జగన్... మూడు రాజధానుల పేరుతో రుషికొండను మింగేసి సొంతానికి ప్యాలట?సలు కట్టుకున్నారు. ఇప్పుడు మావిగన్ జోకర్'గా మిగిలారు. నాన్నకు వారసుడిని అని చెప్పుకొనే ఆయన... వైఎస్ఆర్ పేరును వాడుకున్నారు తప్పితే, ఆయన ఆశయాలకు వారసుడు కాలేదు" అని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల విమర్శించారు.

-మిగతా 3 లో




## రిలయన్స్ రిటైల్ వాల్యుయేషన్ భళా

- జనవరి నాటికి రూ.9.26 లక్షల కోట్లు
- హెక్టాకార్న్ జాబితాలో ఏడో స్థానం
- స్టాన్‌ఫోర్డ్ గ్రాడ్యుయేషన్ స్కూల్ ఆఫ్ బిజినెస్

**న్యూఢిల్లీ**
ముకేశ్ అంబానీ కుమార్తె ఇషా అంబానీ నాయకత్వంలోని 'రిలయన్స్ రిటైల్' మరో రికార్డు సృష్టించింది. ఈ ఏడాది జనవరి నాటికి అందుబాటులో ఉన్న వివరాల ప్రకారం కంపెనీ విలువ (వాల్యుయేషన్) 10,000 కోట్ల డాలర్లు (సుమారు రూ.9.26 లక్షల కోట్లు) దాటింది. దీంతో స్టాన్‌ఫోర్డ్ గ్రాడ్యుయేట్ స్కూల్ ఆఫ్ బిజినెస్ ఈ కంపెనీని విలువపరంగా ప్రపంచంలోని ఏడో అతి పెద్ద ప్రైవేటు స్టార్టప్ కంపెనీగా ప్రకటించింది. ఏదైనా ప్రైవేటు స్టార్టప్ కంపెనీ మార్కెట్ విలువ 10,000 కోట్ల డాలర్లు దాటితే దాన్ని హెక్టాకార్న్ లేదా సూపర్ స్టార్టప్ అంటారు. మన దేశం నుంచి రిలయన్స్ రిటైల్ ఒక్కటే ఈ జాబితాలో చోటు సంపాదించింది. ప్రపంచంలో మరే ప్రైవేటు రిటైల్ స్టార్టప్ కూడా ఈ స్థాయిలో లేదని ఎస్‌జీసీబీ తెలిపింది. అగ్రస్థానంలో 'ఓపెన్ ఏఐ': ఈ తాజా జాబితాలో ఓపెన్ ఏఐ, ఆంత్రోపిక్, ఇలాన్ మస్క్ నిర్వహణలోని స్పేస్ ఎక్స్ కంపెనీలు వరుసగా మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి. స్టాన్‌ఫోర్డ్ గ్రాడ్యుయేట్ స్కూల్ ఆఫ్ బిజినెస్ 100 ప్రైవేట్ స్టార్టప్ కంపెనీలతో

-మిగతా 3 లో

## భారత జీడీపీ 6.6 శాతానికి తగ్గొచ్చు

- ప్రపంచ బ్యాంక్ రిపోర్ట్

3




## హజ్ యాత్ర-2026 కు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి

- అధికార యంత్రాంగాన్ని ఆదేశించిన మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్
- విజయవాడలో హజ్ హౌస్ నిర్మాణానికి చర్యలు
- హజ్ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించిన మంత్రి
- ఏపీ నుంచి హజ్ కు 2000 మంది ప్రయాణికులు

**అమరావతి, ఏప్రిల్ 9(డ్రీమ్ టైమ్స్):**
ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం నుండి హజ్ - 2026 కి మొత్తం 2000 మంది యాత్రికులు బయలుదేరనున్నారని, అందులో విజయవాడ ఎంబార్కేషన్ కేంద్రం నుంచి ఏప్రిల్ 18 మరియు 19 తేదీలలో 352 మంది ప్రయాణికులు బయలుదేరనున్నారని, వారందరికీ ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు చేపట్టాలని

-మిగతా 4 లో




## ఆ నేతలకు శ్రీముఖాలు!

- నలుగురు ఎమ్మెల్యేలు, ముగ్గురు ఇన్‌చార్జులకు నోటీసులివ్వనున్న టీడీపీ నాయకత్వం
- జాబితాలో పుట్టా సుధాకర్, మాధవిరెడ్డి, వరదరాజులురెడ్డి, చైతన్యరెడ్డి, బీటెక్ రవి, పరిటాల శ్రీరాం
- పార్టీ క్యాడర్ సమావేశాలు, గ్రీవెన్స్ విధిగా నిర్వహించాల్సిందే
- ఎవరినీ ఉపేక్షించేది లేదు: లోకేశ్

**అమరావతి, ఏప్రిల్ 9(డ్రీమ్ టైమ్స్):**
నలుగురు టీడీపీ ఎమ్మెల్యేలు.. ఇద్దరు నియోజకవర్గ ఇన్‌చార్జులకు నోటీసులు ఇచ్చేందుకు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు సిద్ధమయ్యారు. మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్, కడప ఎమ్మెల్యే మాధవిరెడ్డి, ప్రొద్దుటూరు ఎమ్మెల్యే వరదరాజులురెడ్డి వరుసగా నాలుగు వారాలు క్యాడర్ సమావేశాలు, గ్రీవెన్స్ నిర్వహించలేదు.

-మిగతా 3 లో



# రాఘవ్ చద్దా కొత్త పార్టీ?!



**న్యూఢిల్లీ ఏప్రిల్ 9(డ్రీమ్ టైమ్స్):**
ఆమ్ ఆద్మీ పార్టీ పక్కకు పెట్టిన ఆ పార్టీ రాజ్యసభ ఎంపీ రాఘవ్ చద్దా కొత్త రాజకీయ పార్టీని స్థాపించే సూచనలు కనిపిస్తున్నాయి! 'ఆసక్తికర ఆలోచన' పేరిట సామాజిక మాధ్యమాల్లో ఆయన షేర్ చేసిన వీడియో ప్రకారం వేరే పార్టీలో చేరే దాని కన్నా కొత్త పార్టీని స్థాపించడమే మేలన్న అభిప్రాయాన్ని ఆయన పంచుకున్నారు.సొంత పార్టీతో విభేదాలు పెరుగుతున్న వేళ ఆయన ఈ విషయాన్ని పంచుకోవడం గమనార్హం. చద్దా తనకున్న ప్రజా మద్దతును నిలబెట్టుకోవాలంటే కొత్త పార్టీని పెట్టడమే మేలన్న ఓ కంటెంట్ క్రియేటర్ వీడియోను ఆయన తన ఖాతాలో పంచుకున్నారు

## కిచెన్‌లోకి అనుమతించకపోవడం క్రూరత్వమే!

- అత్తింట్లో వేధింపులపై బాంబే హైకోర్టు



**ముంబై ఏప్రిల్ 9(డ్రీమ్ టైమ్స్):**
మెట్టినింట్లో కోడలిని వంట గదిలోకి అనుమతించకపోవడం మానసిక క్షోభకు గురి చేయడం కిందికే వస్తుందని బాంబే హైకోర్టు స్పష్టం చేసింది. తన భర్త తనను వంట గదిలోకి రానివ్వడం లేదని ఓ మహిళ దాఖలు చేసిన పిటిషన్ విచారణ సందర్భంగా కోర్టు ఈ విషయాన్ని వెల్లడించింది. ఇలాంటి చర్యలు మహిళల గౌరవాన్ని కించపరచడంతో పాటు మానసిక క్షోభకు గురి చేసినట్టే అవుతుందని తేల్చి చెప్పింది. 2022లో తనకు పెండ్లయిందని.. కొద్ది కాలానికే భర్తతో తనకు వివాదాలు మొదలయ్యాయని కక్షిదారు కోర్టుకు, పోలీసులకు ఫిర్యాదు చేశారు.తన ప్రాథమిక హక్కులకు తన అత్తింటివారు భంగం కలిగిస్తున్నారని ఆమె పేర్కొన్నారు. 'నన్ను వంట గదిలోకి అనుమతించలేదు. నా తిండిని బయట నుంచి తెచ్చుకోవాలని ఒత్తిడి చేశారు. విడాకులు ఇవ్వాలని ఇబ్బంది పెడుతున్నారు' అని ఆమె కోర్టుకు తెలిపారు. అయితే విడాకులు ఇవ్వాల్సి వస్తుందనే కారణంతోనే ఆమె ఈ ఆరోపణలు చేస్తున్నారని ప్రతివాది న్యాయవాది కోర్టులో వాదించారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ మెట్టినింట్లో కోడలిని సాధారణ అవసరాలను కూడా తీర్చుకోనివ్వకుండా కట్టడి చేయడం మానసిక క్రూరత్వం కిందికే వస్తుందని చెప్పింది.

## ఇంధన కొరత..
## గల్ఫ్ దేశాలకు కేంద్ర మంత్రులు



**న్యూఢిల్లీ,ఏప్రిల్ 9(డ్రీమ్ టైమ్స్):**
అమెరికా-ఇరాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పదం కుదిరినప్పటికీ.. దేశీయంగా ఇంధన కొరతపై ఆందోళన వ్యక్తమవుతున్నది. ఈ క్రమంలో కేంద్ర మంత్రులు హర్దీప్ సింగ్ పురీ, విదేశాంగ మంత్రి జైశంకర్ గల్ఫ్ దేశాల పర్యటనకు సిద్ధమయ్యారు. కేంద్ర పెట్రోలియం మంత్రి హర్దీప్‌సింగ్ పురీ ఖతార్‌లో పర్యటిస్తున్నారని తెలిసింది.గురు, శుక్రవారాల్లో ఆయన ఖతార్‌లో అక్కడి ముఖ్య అధికారులతో మంతనాలు జరుపుతారని వార్తలు వెలువడ్డాయి. ఇరాన్ ప్రతీకార దాడుల నేపథ్యంలో ఎల్ఎన్‌జీ ఉత్పత్తి, ఎగుమతులను ఖతార్ అధికారులు నిలిపివేశారు. తాజా కాల్పుల విరమణ ఒప్పందం కుదరటంతో ఉత్పత్తులను మళ్లీ ప్రారంభించాలని అక్కడి అధికారులు భావిస్తున్నట్టు తెలిసింది. విదేశాంగ మంత్రి జైశంకర్ దుబాయ్‌లో పర్యటించనున్నారు. ఈనెల 11-12 తేదీల్లో జైశంకర్ పర్యటన ఉంటుందని విదేశాంగ శాఖ పేర్కొన్నది.

## బీహార్‌కు కొత్త 'సామ్రాట్'!


**పాట్నా ఏప్రిల్ 9(డ్రీమ్ టైమ్స్):**
: బీహార్ సీఎంగా నితీశ్ కుమార్ రెండు దశాబ్దాల ప్రస్థానం వచ్చే వారం ముగియనుంది. ఆయన శుక్రవారం రాజ్యసభ సభ్యుడిగా ప్రమాణ స్వీకారం చేయడానికి ఢిల్లీకి బయల్దేరి వెళ్లారు. ఈ 14న ముఖ్యమంత్రి పదవికి నితీశ్ రాజీనామా చేసే అవకాశం ఉన్నది.అదే రోజు ఎన్డీయే శాసనసభా పక్ష సమావేశం జరుగనున్నది. ఆ సమావేశంలోనే కొత్త ముఖ్యమంత్రిని ఎన్నుకోనున్నారు. ప్రస్తుతం ఉప ముఖ్యమంత్రిగా ఉన్న సామ్రాట్ చౌదరికి సీఎం పదవి వరించే అవకాశం ఉన్నదని జోరుగా ప్రచారం జరుగుతున్నది. నాయకత్వ మార్పు గురించి చర్చించేందుకు పార్టీ హైకమాండ్‌ను కలిసేందుకు ఆయన ఢిల్లీకి వెళ్లారు.



# పాక్ వల్లే లెబనాన్‌పై అయోమయం!

- ఇరాన్‌కు ఒకలా, అమెరికాకు మరోలా ఒప్పంద అంశాలు

**న్యూఢిల్లీ ఏప్రిల్ 9(డ్రీమ్ టైమ్స్):**
పాకిస్థాన్‌కు విజయోత్సవ రోజు. ఎందుకంటే అమెరికా-ఇరాన్ కాల్పుల విరమణకు మధ్యవర్తిత్వం వహించడం ద్వారా ఎన్నో ఏండ్ల తర్వాత అతిపెద్ద దౌత్య విజయాన్ని పాక్ సాధించింది. అయితే ఆ ఆనందం పాక్‌కు ఎంతోసేపు నిలవలేదు. లెబనాన్‌పై ఇజ్రాయెల్ భారీ స్థాయిలో దాడి జరపడంతో కాల్పుల విరమణ ఒప్పందం ఆదిలోనే నీరుగారిపోయింది. ఇరాన్ మిత్రదేశమైన లెబనాన్‌పై జరిగిన ఈ దాడి కారణంగా వందలాది మంది మరణించారు. ఇప్పుడు గందరగోళమంతా కాల్పుల విరమణ ఒప్పందంలో




లెబనాన్ భాగమా కాదా అన్నదే. ఉభయ పక్షాలకు ఒప్పందాన్ని వివరించే బాధ్యత వహించిన పాకిస్థాన్ ఇప్పుడు ఈ దుమారానికి కేంద్రబిందువుగా మారింది. మార్చి 2 నుంచి ఇజ్రాయెల్ దాడులను ఎదుర్కొంటున్న లెబనాన్ కాల్పుల విరమణ ఒప్పందంలో ఎన్నడూ భాగం కాదని అమెరికా, ఇజ్రాయెల్ చెబుతున్నాయి. అయితే ఇరాన్ మాత్రం బుధవారం అమెరికా, ఇరాన్ మధ్య కాల్పుల విరమణ గురించి పాకిస్థాన్ ప్రధాని షరీఫ్ ప్రకటన చేస్తూ లెబనాన్‌తోసహా అంతటా ఇది వర్తిస్తుందని స్పష్టంగా ప్రకటించారని వాదిస్తున్నది. ఇరాన్, అమెరికా తమ మిత్రదేశాలతో కలిసి లెబనాన్, ఇతర ప్రాంతాలతో సహా అన్ని చోట్ల తక్షణమే కాల్పుల విరమణకు అంగీకరించాయి. ఇది తక్షణమే అమల్లోకి వస్తుంది అని షరీఫ్ బుధవారం ట్వీట్ చేశారు. నిమిషాల వ్యవధిలోనే దీన్ని ఇజ్రాయెల్ స్వాగతిస్తూ అయితే లెబనాన్ ఇందులో భాగం కాదని స్పష్టం చేసింది. అంతేగాక గంటల్లోనే లెబనాన్‌పై భీకరం దాడులు చేసింది.

## పాక్ మధ్యవర్తిత్వంపై
## మాకు నమ్మకం లేదు

- ఇజ్రాయెల్ రాయబారి

**జెరూసలేం,ఏప్రిల్ 9(డ్రీమ్ టైమ్స్):**
ఇరాన్-అమెరికా మధ్య శాంతి చర్చలకు ఇస్లామాబాద్ వేదికగా మారింది. ఈ తరుణంలో ఇండియాలో ఇజ్రాయెల్ రాయబారి రీవెన్ అజార్ పాకిస్థాన్‌పై సంచలన వ్యాఖ్యలు చేశారు. ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్థాన్‌ను ఇజ్రాయెల్ నమ్మటం లేదన్నారు. చర్చల సందర్భంగా తలెత్తే పరిస్థితిని పరిష్కరించడానికి అమెరికా మిత్రులపై ఆధారపడుతున్నామని చెప్పారు.పశ్చిమాసియాలో ఇరాన్‌తో సాగుతున్న యుద్ధంపై బుధవారం కీలక ప్రకటన వెలువడిన సంగతి తెలిసిందే. రెండు వారాలపాటు తాత్కాలిక కాల్పుల విరమణ ప్రకటించిన అమెరికా-ఇరాన్.. ఇస్లామాబాద్‌లో శాంతి చర్చలకు సిద్ధమవుతున్నాయి. యుద్ధ సంక్షోభంపై ఇరు వర్గాల మధ్య జరగనున్న ముఖాముఖి చర్చలకు పాకిస్థాన్ ఆతిథ్యం ఇవ్వబోతున్నది.




## కొన్ని ఆలయాల్లో
## పురుషులకూ ప్రవేశం లేదు

- శబరిమల కేసులో సుప్రీంకోర్టులో కేంద్రం వాదనలు

**న్యూఢిల్లీ ఏప్రిల్ 9(డ్రీమ్ టైమ్స్):**
శబరిమల ఆలయంలో మహిళల ప్రవేశంపై ఎలాంటి నిబంధన ఉందో.. కేరళలోని కొన్ని దేవాలయాల్లో పురుషుల ప్రవేశంపైనా నిషేధముందని కేంద్రం సుప్రీంకోర్టుకు తెలిపింది. శబరిమల ఆలయంలో ప్రవేశంపై ఆంక్షల్ని కేవలం లింగబేధంతో చూడరాదని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదించారు.భారతదేశంలో మతపరమైన హక్కులు, స్వేచ్ఛలకు సంబంధించిన వివిధ చట్టపరమైన ప్రశ్నలను పరిశీలిస్తున్న రాజ్యాంగ ధర్మాసనం ముందు గురువారం కేంద్రం తన వాదనను వినిపించింది. శబరిమల కేసులో 2018 నాటి సుప్రీంకోర్టు తీర్పును తుషార్ మెహతా తప్పుబట్టారు. పురుషులు ఉన్నతమైన వారని, మహిళలు తక్కువ స్థాయిలో ఉంటారనే భావనతో ఆనాడు శబరిమల తీర్పు వెలువడిందని ఆయన అన్నారు.



## వెంటనే చేరే వాళ్లకే ప్రాధాన్యం..

- ఉద్యోగ మార్కెట్‌పై తాజా సర్వే వెల్లడి



**న్యూఢిల్లీ ఏప్రిల్ 9(డ్రీమ్ టైమ్స్):**
భారత ఉద్యోగ మార్కెట్ కీలకమైన మార్పులకు లోనవుతున్నది. ఫౌండ్‌ఇట్ సర్వే ప్రకారం వెంటనే ఉద్యోగంలో చేరే వారికి కంపెనీలు ప్రాధాన్యం ఇస్తున్నట్టు తేలింది. పెరుగుతున్న పోటీ వాతావరణంలో తక్కువ సమయంలో లక్ష్యాలను చేరుకొనేందుకు కంపెనీలు ఈ విషయానికి ప్రాధాన్యం ఇస్తున్నట్టు తెలిసింది. 2022 నుంచి ఈ పోకడ 58 శాతం పెరిగింది.అయితే అలాంటి అభ్యర్థుల లభ్యత కేవలం 12 శాతం మాత్రమే పెరిగింది. దీంతో ప్రతిభావంతులను ఉద్యోగులుగా చేర్చుకొనే విషయం సంస్థలకు సవాల్‌గా మారింది. దీంతో వాటి వ్యాపార ప్రాజెక్టులు ఆలస్యమవుతున్నాయి. 'వెంటనే చేరేవాళ్లు', 'షార్ట్ నోటీస్ (30 రోజుల్లోపు), 'అత్యవసర నియామకం' లాంటి పదాల వాడకం జాబ్ మార్కెట్‌లో బాగా పెరిగింది.

## పెళ్లి మండపం నుంచే ఓటు వేయడానికి వచ్చిన నూతన వధూవరులు



**తిరువనంతపురం ఏప్రిల్ 9(డ్రీమ్ టైమ్స్):**
కేరళలో నేడు ఎన్నికల పోలింగ్ జరుగుతుంది. ఈ నేపథ్యంలో అప్పుడే పెళ్లి చేసుకున్న నూతన వధూవరులు దివ్యశ్రీ, అశ్వంత్ లంబోధరన్‌లు వారు వివాహం చేసుకున్న పెళ్లి మండపం నుంచి నేరుగా పోలింగ్ బూత్ వద్దకు వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ ఘటన తిరువనంతపురంలోని వాజుముట్టం పోలింగ్ బూత్ వద్ద జరిగింది. పెళ్లి దుస్తులోనే ఉన్న ఈ నూతన వధూవరుల్ని నిర్మల్ హరింద్రన్ తన కెమెరాలో క్లిక్‌మనిపించారు.

# నౌకల్లోనే ఉండండి, బయటికి రావద్దు..

- హర్మూజ్‌లోని భారత నావికులకు కేంద్రం అడ్వయిజరీ

**న్యూఢిల్లీ ఏప్రిల్ 9(డ్రీమ్ టైమ్స్):**
హర్మూజ్ జలసంధి లో చిక్కుకుపోయిన భారత నావికులకు కేంద్రం అత్యవసర అడ్వయిజరీ జారీచేసింది. ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని, అనవసరంగా నౌకల నుంచి బయటకు రావద్దని సూచించింది. ఈ మేరకు డైరెక్టర్ జనరల్ ఆఫ్ షిప్పింగ్ ఒక ప్రకటన విడుదలచేసింది. భద్రతాకారణాల దృష్ట్యా ఇరాన్ దాని పరిసర జలాల్లో చిక్కుకుపోయిన భారత నావికులు సున్నితమైన ప్రదేశాలకు దూరంగా ఉండాలని పేర్కొన్నది. అవసరమైతే తప్ప ఎవరూ బయటకు రావద్దని



సూచించింది.ఎప్పటికప్పుడు భారత రాయబార కార్యాలయంతో టచ్‌లో ఉండాలని కోరింది. నౌకలలో ఉన్న నావికులు వాటిలోనే ఉండాలని పేర్కొన్నది. అప్రమత్తంగా ఉంటూ.. అధికారులు జారీచేసే సూచనలను పాటించాలని కోరింది. కంపెనీ ప్రతినిధులు, అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ ఉండాలని సూచించింది. దాదాపు 40 రోజుల భీకర దాడుల తర్వాత ఇరాన్-అమెరికా మధ్య రెండు రోజుల క్రితం రెండు వారాల కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. అయినప్పటికీ పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తొలగిపోలేదు. అయితే ఇంతలో లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు చేయడం మరోసారి ఉద్రిక్తతలకు దారితీసింది. దీనిపై ఆగ్రహం వ్యక్తంచేసిన ఇరాన్ హర్మూజ్‌ను మరోసారి మూసివేసింది. దాంతో పరిస్థితి మళ్లీ ఉద్రిక్తంగా తయారైంది. ఈ నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలంటూ భారత నావికులకు అడ్వయిజరీ జారీచేసింది.

# లెబనాన్‌తో శాంతి చర్చలకు సిద్ధం!

- నెతన్యాహు ప్రకటన
- హెజ్బొల్లా ఆయుధాలు వీడాలని స్పష్టీకరణ

**టెల్ అవీవ్, ఏప్రిల్ 9(డ్రీమ్ టైమ్స్):**
లెబనాన్‌పై భీకర దాడుల తర్వాత ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు గురువారం కీలక ప్రకటన చేశారు. లెబనాన్‌తో ప్రత్యక్ష శాంతి చర్చలకు సిద్ధమని ప్రకటించారు. లెబనాన్ నుంచి పదేపదే విజ్ఞప్తులు వచ్చిన నేపథ్యంలో ఆ దేశంతో 'వీలైనంత త్వరగా' శాంతి చర్చలు జరిపేందుకు క్యాబినెట్‌కు అనుమతి ఇచ్చానని వెల్లడించారు. అయితే లెబనాన్‌లోని



తిరుగుబాటు సంస్థ హెజ్బొల్లా ఆయుధాలు వీడాలన్నదే చర్చలలో ప్రధాన అంశమని స్పష్టంచేశారు.ఇరాన్, అమెరికా మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందంలో లెబనాన్ భాగం కాదని, హెజ్బొల్లాపై తమ దాడులు కొనసాగుతాయని ప్రకటించిన నెతన్యాహు.. తాజాగా శాంతి చర్చలకు ముందుకు రావడం గమనార్హం. అంతకుముందు లెబనాన్ వ్యాప్తంగా జరిగిన భీకర దాడుల్లో హెజ్బొల్లా అధిపతి నయీమ్ ఖాసెమ్ మేనల్లుడు, సన్నిహిత సహాయకుడు మరణించినట్లు ఇజ్రాయెల్ ప్రకటించింది. హెజ్బొల్లాపై ఇజ్రాయెల్ తన సైనిక దాడులను కొనసాగిస్తుందని నెతన్యాహు గురువారం స్పష్టం చేశారు.

మార్నింగ్ కాఫీ విత్ హాట్ న్యూస్‌తో...! మీ
డ్రీమ్ టైమ్స్
తెలుగు దిన పత్రిక
DREAM TIMES DAILY NEWS PAPER

శుక్రవారం
10-4-2026



# ఈడెన్‌లో ముకుల్ చౌదరి సునామీ..!

మొదటి తరువాయి

దిగిన లక్నో సూపర్ జెయింట్స్.. ఆదిలోనే వికెట్లు కోల్పోయింది. మిచెల్ మార్ష్ (15), ఎయిడెన్ మార్‌క్రమ్ (22), రిషభ్ పంత్ (10) స్వల్ప స్కోరుకే ఔట్ అయ్యారు. ఓ దశలో 128 పరుగులకే 7 వికెట్లు కోల్పోయిన లక్నో.. విజయావకాశాలు సంక్లిష్టం చేసుకుంది. ఇలాంటి సమయంలోనే ముకుల్ చౌదరి అద్భుతం చేశాడు. అసాధారణ హిట్టింగ్‌తో కేకేఆర్‌కు మ్యాచును దూరం చేశాడు. ఈ ఇన్నింగ్స్‌లో27 బంతులు ఎదుర్కొన్న ఈ 21 ఏళ్ల ప్లేయర్.. ఏకంగా ఏడు సిక్సర్లు బాదాడు. రెండు ఫోర్లు కూడా కొట్టాడు. దీంతో 200ల స్ట్రైక్ రేటుతో 54 రన్స్ చేసి.. జట్టును గెలిపించాడు. లక్నో విజయానికి చివరి 2 ఓవర్‌లలో 30 రన్స్ అవసరమయ్యాయి. ఈ సమయంలో కామెరూన్ గ్రీన్ వేసిన ఇన్నింగ్స్ 19వ ఓవర్‌లో ముకుల్ 16 రన్స్ రాబట్టాడు. చివరి ఓవర్ తొలి బంతికి ఆవేశ్ ఖాన్.. సింగిల్ తీశాడు. దీంతో స్ట్రైకింగ్‌లోకి వచ్చిన అతడు రెండో బంతిని స్టాండ్స్‌లోకి పంపించాడు. ఐదో బంతికి సైతం అదే శిక్ష వేశాడు. చివరి బంతికి ఒక్క పరుగు అవసరం కాగా.. బ్యాటుకు బంతి తాకకపోయినా ఇద్దరు బ్యాటర్లూ పరుగు పూర్తి చేశారు. దీంతో లక్నో టీమ్ సంబురాల్లో మునిగితేలింది. 3 వికెట్ల తేడాతో విజయం సాధించింది.అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన కోల్‌కతా నైట్ రైడర్స్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 181 పరుగులు చేసింది. కేకేఆర్ బ్యాటర్లలో ఎ.రఘువంశీ (33 బంతుల్లో 45 రన్స్) టాప్ స్కోరర్‌గా నిలిచాడు.

# దీదీ ఆస్తులు అంతంత మాత్రమే

-చిర,చరాస్థులు కూడా లేవు
-సొంత ఇల్లు అంతకన్నా లేదు
-బ్యాకులో కేవలం రూ.12.4లక్షల నగదు నిల్వ



**కోల్‌కతా,**

మమతా బెనర్జీ పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో ఫైర్ బ్రాండ్ ముఖ్యమంత్రిగా దాదాపు పదిహేనేళ్లుగా కొనసాగుతున్నారు. పశ్చిమ బెంగాల్‌లో ఆమెను అందరూ 'దీదీ' అని పిలుస్తారు. సుదీర్ఘకాలం అధికారంలో ఉన్నప్పటికీ, ఆమె గడుపుతున్న నిరాడంబర జీవితం నేటి తరం రాజకీయ నాయకులకు ఒక ఆదర్శంగా నిలుస్తోందని అంటున్నారు. ఇప్పటికీ తన పేరిట ఒక సొంత ఇల్లు, భూమి లేవని ఆమె వెల్లడించడం మరోసారి చర్చనీయాంశంగా మారింది. త్వరలో జరగనున్న బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో భవానీ పూర్ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న మమత బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ వేసే సమయంలో కూడా ఆమె ఎప్పటిలాగే తన ట్రేడ్‌మార్క్ కాటన్ చీర, హవాయి చెప్పులతో ఎంతో సాదాసీదాగా కనిపించడం అందరినీ ఆకట్టుకుంది.మమతా బెనర్జీ అఫిడవిట్‌లో సమర్పించిన ఆస్తుల వివరాలు ఇలా ఉన్నాయి. ఇండియన్ బ్యాంక్‌లో దీదీ పర్సనల్ ఖాతాలో సుమారు రూ.12.4లక్షలు ఉన్నాయి. ఎన్నికల ఖర్చుల కోసం అదే బ్యాంక్‌లో ఉన్న మరో ఖాతాలో రూ.40,000 ఉన్నాయి. అంటే మొత్తం బ్యాంకు నిల్వలు సుమారు రూ.13 లక్షలు. చేతిలో రూ.75,000 నగదు ఉన్నట్లు మమతా బెనర్జీ తన అఫిడవిట్‌లో పేర్కొన్నారు. దీదీ వద్ద కేవలం 9.75గ్రాముల బంగారు ఆభరణాలు మాత్రమే ఉన్నాయి. 2021లో దాని విలువ రూ.88,887 ఉండగా, ప్రస్తుతం బంగారం రేటు పెరగడంతో రూ.1.75లక్షలకు పెరిగింది. మమత బెనర్జీకి సొంత ఇల్లు లేదు. ఎక్కడ వ్యవసాయ భూమి కానీ, నివాస స్థలాలు కానీ లేవని అఫిడవిట్‌లో పేర్కొన్నారు. కనీసం వ్యక్తిగత వాహనం కూడా లేదని ఆమె తన అఫిడవిట్‌లో తెలిపారు.

# కాళేశ్వరం మరమ్మతులు వెంటనే చేపట్టండి

ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ సూచనల మేరకు పనులను వేగంగా పూర్తి చేయాలన్నారు. మరమ్మతులకు సంబంధించిన ఏజెన్సీలన్నింటినీ భాగస్వామ్యం చేయాలని సూచించారు. సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్ (సీడబ్ల్యూపీఆర్ఎస్) ఆధ్వర్యంలో జరుగుతున్న పరీక్షలు, నమూనాల సేకరణను వర్షాకాలం ప్రారంభానికి ముందే పూర్తి చేయాలని సీఎం స్పష్టం చేశారు. నీటిపారుదల శాఖ, సీడబ్ల్యూపీఆర్ఎస్, బ్యారేజీల నిర్మాణ సంస్థలు, డిజైన్ కన్సల్టేషన్లతో టీమ్ ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి పనిలో సెంట్రల్ వాటర్ కమిషన్ (సీడబ్ల్యూసీ) సభ్యులు ఉండేలా చూడాలన్నారు. మేడిగడ్డలో కుంగిపోయిన పిల్లరే కాకుండా మొత్తం 1.6 కిలోమీటర్ల బ్యారేజీని అధ్యయనం చేయాల్సి ఉంటుందని ఈ సందర్భంగా ఇంజనీర్లు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చారు. మేడిగడ్డ దగ్గర 500 బోరు బావులు తవ్వాల్సి ఉందనీ, ఇందుకోసం ప్రత్యేక యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని సీఎం ఆదేశించారు. ఇందుకు కావాల్సిన యంత్రాలను సమకూర్చుకుని వీలైనంత త్వరగా పని పూర్తి చేయాలన్నారు. డిసెంబరు వరకు చేయాల్సిన పనులపై పూర్తి షెడ్యూల్ సిద్ధం చేయాలని ఆదేశించారు. పనుల్లో జాప్యం జరగడానికి వీలు లేదన్న ముఖ్యమంత్రి నిధుల విషయంలో ఇబ్బంది కల్గనివ్వమని స్పష్టం చేశారు. మేడిగడ్డ వద్ద బేస్ క్యాంపు ఏర్పాటు చేయాలని సూచించారు. పనులు ప్రారంభం అయ్యాక తాను స్వయంగా వచ్చి పరిశీలిస్తానని ముఖ్యమంత్రి తెలిపారు. సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, నీటి పారుదల శాఖ కార్యదర్శి శ్రీధర్, సీఎం కార్యదర్శి మానిక్ రాజ్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# రిలయన్స్ రిటైల్ వాల్యుయేషన్ భళా

మొదటి తరువాయి

రూపొందించిన జాబితాలో ఈ మూడు కంపెనీల వాల్యుయేషనే మూడో వంతు వరకు ఉంది. ఇక మన దేశానికి చెందిన ఎన్ఎసఈ (2,400 కోట్ల డాలర్లు), టాటా ఈవీ మొబిలిటీ (900 కోట్ల డాలర్లు) 27, 93వ స్థానాల్లో నిలిచాయి.

# భారత జీడీపీ 6.6 శాతానికి తగ్గొచ్చు

ప్రపంచ బ్యాంక్ రిపోర్ట్




న్యూఢిల్లీ :

పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలు భారత ఆర్థిక వ్యవస్థకు ప్రధానంగా ఇంధన సెగను పెంచుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు బ్యారెల్‌కు 90 నుంచి 100 డాలర్ల మధ్య ఊగిసలాడటం భారత్‌కు అతిపెద్ద సవాలుగా మారిందని ప్రపంచ బ్యాంక్ తెలిపింది. చమురు ధరలు పెరిగితే దేశీయంగా రవాణా భారమై, ద్రవ్యోల్బణం పెరిగే ప్రమాదం ఉందని.. దీనివల్ల వృద్ధి రేటుపై ఒత్తిడి పడి 2026-27 ఆర్థిక సంవత్సరంలో జీడీపీ 6.6 శాతానికి నెమ్మదించవచ్చని ప్రపంచ బ్యాంక్ హెచ్చరించింది. వాణిజ్యపరంగా చూస్తే ప్రపంచవ్యాప్తంగా ఎగుమతులపై విధిస్తున్న భారీ టారిఫ్‌లు భారత ఎగుమతిదారులకు ప్రతిబంధకంగా మారాయి.
పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణం వల్ల అంతర్జాతీయ వాణిజ్య మార్గాల్లో అస్థిరత ఏర్పడి, సరఫరా గొలుసు దెబ్బతినే అవకాశం ఉంది. ఇది ఎగుమతులపై ఆధారపడిన రంగాలను దెబ్బతీస్తూనే దిగుమతి చేసుకునే ముడి సరుకుల ఖర్చును పెంచి తయారీ రంగాన్ని ప్రతికూలతల్లోకి నెట్టే ప్రమాదం ఉంది. ప్రస్తుతానికి భారత్ వద్ద పటిష్టమైన విదేశీ మారక నిల్వలు, ఆర్థిక వెసులుబాటు ఉన్నప్పటికీ సంక్షోభం దీర్ఘకాలం కొనసాగితే ఈ బఫర్స్ కరిగిపోయే ముప్పు పొంచి ఉంది.

# పోలింగ్ ప్రశాంతం

మొదటి తరువాయి

ఆరుగంటల వరకు అనుమతించారు. ఆ సమయానికి క్యూలో వున్న వారికి టోకెన్లు ఇచ్చి ఓటు వేసేందుకు అనుమతిచ్చారు.

**కేరళలో**

కేరళలోని 140 అసెంబ్లీ నియోజకవర్గాలకు పోలింగ్ సాఫీగా, సజావుగా సాగింది. 2021లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 76శాతం పోలింగ్ నమోదు కాగా, ప్రస్తుత ఎన్నికల్లో అంతకంటే అధికంగానే నమోదైంది. ఈసారి కోయకోడ్‌లో అత్యధికంగా 77శాతం పోలింగ్ నమోదైందని ఎన్నికల కమిషన్ పేర్కొంది. ముఖ్యమంత్రి పినరయి విజయన్, గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్, పలువురు మంత్రులు, నటులు సహా పలువురు ప్రముఖులు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. కేరళలో జెన్‌జీ పోలింగ్ బూత్ అందరినీ ఆకట్టుకుంది. తొలిసారి ఓటు వేసిన వారు సెల్ఫీ దిగేందుకు వీలుగా ఏర్పాటు చేశారు. కాగా తొలిసారి ఓటు వేసిన వారందరికీ ఎన్నికల కమిషన్ 'స్వీట్ సర్‌ప్రైజ్' ఇచ్చింది. ప్రతి జిల్లాలో మొదటసారి ఓటు వేసిన 200మందికి హల్వా పంచింది.

ఎన్నికల అధికారి మృతి

అసోంలోని సోనిత్‌పూర్ జిల్లాలో ఎన్నికల అధికారి దేబెన్ హోరో (45) మరణించి వుండగా కనుగొన్నారు. ఆయన మరణానికి కారణమేంటో ఇంకా నిర్ధారించలేదు. నాడార్ నియోజకవర్గంలో రెండో పోలింగ్ అధికారిగా ఆయనను నియమించారు. గురువారం ఉదయం ఆయన మంచంపై స్పృహ లేకుండా పడి వుండగా చూశారు. వెంటనే అంబులెన్సులో ఆస్పత్రికి తీసుకెళ్ళినా ఫలితం లేకపోయింది. ఆయన మరణించారని అధికారులు తెలిపారు.

పోలింగ్‌బూత్‌లో వీడియో : ఎఫ్ఐఆర్ నమోదు

పోలింగ్ బూత్‌ల్లో ఫోన్లు నిషిద్ధం. కేంద్రంలోకి వెళ్ళేముందు ఫోన్లు, బ్యాగ్‌లు సహా అన్ని వస్తువులను ఇచ్చి లోపలకు వెళ్లాలని ఈసీ కూడా స్పష్టంగా పేర్కొంది. కానీ అస్సాంలోని కర్బి అనగ్లాంగ్ జిల్లా యంత్రాంగం గురువారం ఇందుకు సంబంధించి పోలీసు ఫిర్యాదు చేసింది. ఒక పోలింగ్ స్టేషన్‌లో జరుగుతున్న పోలింగ్ ప్రక్రియను చూపిస్తునట్లుగా వున్న వీడియో ఒకటి సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయిందని అధికారులు తెలిపారు. దిఫూ నియోజకవర్గంలోని పోలింగ్ స్టేషన్‌లో తీసిన వీడియోగా భావిస్తున్నారు. వెంటనే దీనిపై విచారణకు ఆదేశించామని చెప్పారు. ప్రజా ప్రాతినిధ్యచట్టంలోని పలు సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్‌ను కూడా నమోదు చేశారు.

పుదుచ్చేరిలో

పుదుచ్చేరిలోని 30 అసెంబ్లీ స్థానాల్లోనూ భారీగా పోలింగ్ నమోదైంది. పుదుచ్చేరిలో ఇంత భారీ స్థాయిలో (86శాతం) ఓటింగ్ నమోదవడం 2006 తర్వాత ఇదే తొలిసారి. వీవీప్యాట్ యంత్రంలోని బ్యాటరీ నుంచి పొగ వస్తుండడంతో కరైకల్‌లో ఒక పోలింగ్ బూత్‌లో కాసేపు పోలింగ్ ఆగింది. ఆ బ్యాటరీని మార్చి కొత్తది పెట్టిన తర్వాత పోలింగ్‌ను పునరుద్ధరించారు.

వామపక్ష సంఘటనకు మళ్ళీ అధికారం

రాష్ట్రంలో వామపక్ష సంఘటన తిరిగి అధికారంలోకి వస్తుందని సీపీఐ కేరళం రాష్ట్ర కార్యదర్శి వినయ్ విశ్వం పేర్కొన్నారు. వట్టియురకవులో తన ఓటు హక్కు వినియోగిం చుకున్న తర్వాత ఆయన మీడియాతో మాట్లాడారు. దేశంలో చోటు చేసుకుంటున్న పరిణామాలను స్పష్టంగా అర్థం చేసుకున్న ప్రజలు తమ నిర్ణయాలు తీసుకుంటున్నారని చెప్పారు. ప్రజాస్వామ్యం, లౌకికవాదం, దేశ సార్వభౌమాధికారం వంటి కీలకమైన స్తంభాలు దెబ్బతింటున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అటువంటి ఆందోళనలే ఓటర్ల అభిప్రాయాలను ప్రభావితం చేస్తున్నాయన్నారు. దేశంలో, అంతర్జాతీయంగా నెలకొన్న రాజకీయ అనిశ్చితులను ప్రస్తావిస్తూ, యుద్ధ మేఘాల నడుమే ప్రజలు ఓటు వేసారన్నారు. వామపక్షాలే విశ్వసనీయమైన ప్రత్యామ్నాయమని అన్నారు. బీజేపీ, కాంగ్రెస్‌లు ఇచ్చే శుష్క వాగ్దానాలు కాకుండా నిరుపేదలకు ఆశ, భద్రత కల్పించేది వామపక్షాలేనని అన్నారు.

# బెంగాల్ మార్పు కోరుకుంటోంది.

- రాష్ట్రం అంతటా నందిగ్రామ్ ఫలితాలే
- భారత్ ఎంతో వేగంగా అభివృద్ధి చెందినప్పటికీ టీఎంసీ ప్రభుత్వం బెంగాల్ అభివృద్ధికి అడ్డుపడుతోంది
- బీజేపీ అధికారంలోకి రాగానే రాజ్యాంగం ప్రకారం టీఎంసీ చేసిన మోసాలను బయటకు తీస్తాం
- తృణమూల్ చేసిన పాపాలు వందేళ్లు గడిచినా తొలగిపోవు
- తృణమూల్ ప్రభుత్వంలో కుంభకోణాలకు, అవినీతికి పాల్పడిన వారిని జైలుకు పంపిస్తాం



**న్యూఢిల్లీ,**

పశ్చిమబెంగాల్ లోని హల్దియాలో ప్రధాని నరేంద్రమోదీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తృణమూల్ కాంగ్రెస్ ( పార్టీపై విమర్శలు గుప్పించారు. ఐదేళ్ల క్రితం నందిగ్రామ్‌లో సీఎం మమతాబెనర్జి ఓటమిని గుర్తుచేస్తూ.. ఈసారి పశ్చిమబెంగాల్ రాష్ట్రం అంతటా అదే ఫలితం పునరావృతమవుతుందని చెప్పారు. పశ్చిమబెంగాల్ మార్పును కోరుకుంటోందని, ఈ క్రమంలో బీజేపీ భారీ విజయాన్ని చూస్తామని వ్యాఖ్యానించారు.నందిగ్రామ్‌లో ఐదేళ్ల క్రితం ఏం జరిగిందో ఇప్పుడు భవానీపూర్‌తోపాటు మొత్తం బెంగాల్‌లోనూ అదే ఫలితం వస్తుందని ప్రధాని జోష్యం చెప్పారు. ఇవి సాధారణ ఎన్నికలు కావని, ఈ ఎన్నికలు అభివృద్ధికి, బెంగాల్ చరిత్రను తిరగరాయడానికి ఎంతగానో తోడ్పడతాయని అన్నారు. భారత్ ఎంతో వేగంగా అభివృద్ధి చెందినప్పటికీ టీఎంసీ ప్రభుత్వం బెంగాల్ అభివృద్ధికి అడ్డుపడుతోందని విమర్శించారు. ప్రైవేటు సెక్టార్లలో సామాన్యులను ఉద్యోగాల నుంచి తొలగించి చొరబాటుదారులకు అవకాశం కల్పిస్తోందని ఆరోపించారు. బీజేపీ అధికారంలోకి రాగానే రాజ్యాంగం ప్రకారం టీఎంసీ చేసిన మోసాలను బయటకు తీస్తామని, బెంగాల్ యువతకు వ్యతిరేకంగా తృణమూల్ చేసిన పాపాలు వందేళ్లు గడిచినా తొలగిపోవని మోదీ వ్యాఖ్యానించారు. ఒక్కసారి డబుల్-ఇంజిన్ సర్కార్ అధికారంలోకి రాగానే కేంద్ర ప్రభుత్వ పథకాలన్నీ ఇక్కడ అమల్లోకి వస్తాయని చెప్పారు. బెంగాల్ ప్రజలకు ఆరు హామీలు ఇస్తున్నానని అన్నారు. అన్యాయానికి గురైన ఆడబిడ్డల కేసులను తిరగదోడుతామని, అవినీతికి సాయం చేస్తున్న చట్టాలను రూపుమాపుతామని తెలిపారు. తృణమూల్ ప్రభుత్వంలో కుంభకోణాలకు, అవినీతికి పాల్పడిన వారిని జైలుకు పంపిస్తామని ప్రధాని అన్నారు. శరణార్థులకు రాజ్యాంగం ప్రకారం ప్రత్యేక హక్కులను కల్పిస్తామని, చొరబాటుదారులను మాత్రం దేశం నుంచి తరిమికొడతామని చెప్పారు. ఒక్కసారి బీజేపీ అధికారంలోకి రాగానే 7వ వేతన కమిషన్‌ను అమల్లోకి తీసుకొస్తామని హామీ ఇచ్చారు.

# ప్రజలకు సుపరిపాలన అందిస్తున్నాం

మొదటి తరువాయి

ప్రతి గ్రామంలో, ప్రతి ఇంట్లో భూ వివాదాలకు తెరలేపారని మండిపడ్డారు. 'పట్టా పుస్తకంపై జగన్ ఫొటో వేసుకున్నారు.. ఆస్తి మీది.. ఫొటో ఆయనది' అని విమర్శించారు. ప్రజల ఆస్తులకు భద్రత ఇవ్వాలనే పట్టాదారు పాస్ పుస్తకాలు ఇస్తున్నామని సీఎం స్పష్టం చేశారు. గత పాలకులు చేసిన పనులు చూసి తనకే మతిపోయిందని సీఎం అన్నారు. నూటికి 90శాతం రెవెన్యూ సమస్యలపైనే అర్జీలు వచ్చేవన్నారు. ప్రజల ఆస్తులకు భద్రత ఇవ్వాలనే పట్టాదారు పాస్ పుస్తకాలు ఇస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. ప్రతినెలా 9న ఒక ప్రాంతంలో రైతులకు పాస్ పుస్తకాలు అందిస్తామని.. జులై నాటికి 9 లక్షల పాస్ పుస్తకాలు ఇస్తామని వెల్లడించారు. 2027 మార్చి నాటికి కోటి 12లక్షల పాస్ పుస్తకాలు అందిస్తామని
వెల్లడించారు. ఎవరూ ట్యాంపర్ చేయలేని విధంగా రికార్డులు మారుస్తున్నామని చెప్పారు. రైతులకు ఇస్తున్న పాస్ పుస్తకాలను ఎవరూ తారుమారు చేయలేరన్నారు. కరెన్సీకి వాడే టెక్నాలజీని పట్టాదారు పాస్ పుస్తకాలకు వాడామని తెలిపారు. అధికారంలోకి రాగానే ల్యాండ్ సీలింగ్ చట్టాన్ని రద్దు చేశామని సీఎం తెలిపారు. 22ఏ నుంచి మీ భూములు తొలగిస్తామని హామీ ఇస్తున్నట్లు చెప్పారు. భూ రిజిస్ట్రేషన్ల పద్ధతిలో కూడా మార్పులు తీసుకొస్తామన్నారు. తల్లిని కోర్టుకు ఈడ్చిన వ్యక్తి మనకు ఆదర్శం కాకూడదని సీఎం అన్నారు. సూర్యలంక బీచ్‌ను అభివృద్ధి చేస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. భూమి నుంచి వచ్చే ఆదాయమే కాకుండా.. సముద్రాన్ని వినియోగించుకోవాలని సూచించారు. గత ప్రభుత్వం ఇష్టానుసారం అప్పులు చేసిందని.. ప్రతి దానిపైనా అప్పులు తీసుకొచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం ఉద్యోగులకు జీతాలు కూడా ఇవ్వలేకపోయిందన్నారు. ఆనాడు హైదరాబాద్‌ను డెవలప్ చేశానని.. ఇప్పుడు అమరావతిని నిర్మిస్తున్నట్లు సీఎం తెలిపారు. అన్నీ ఆలోచించే రాజధానికి అమరావతి పేరు పెట్టానని స్పష్టం చేశారు. 'ప్రజా రాజధాని.. దేవతల రాజధాని.. అమరావతి' అని పేర్కొన్నారు. ఆనాడు బాబాయ్‌ని చంపి.. ఆ నేరం తనపై వేశారని సీఎం మండిపడ్డారు. అమరావతిపై జగన్ కక్షగట్టారని.. ఆనాడు ఆడబిడ్డలను వేధించారన్నారు. డ్రోన్లతో ఆడబిడ్డలను వీడియోలు తీశారని, లాఠీలతో కొట్టించారని గుర్తుచేశారు. అమరావతి విషయంలో న్యాయం, ధర్మం, చట్టం గెలిచిందన్నారు. ప్రాంతాలు, కులాలతో రాజకీయం చేస్తే గెలవలేమని చెప్పుకొచ్చారు. ఇప్పటివరకు జగన్ ఒక్కడే సైకో అనుకున్నామని.. వైసీపీ నేతలంతా సైకోలుగా మారారని వ్యాఖ్యానించారు. 'నీలాంటి వెయ్యి మంది సైకోలు వచ్చినా అమరావతి ఆగదు' అని స్పష్టం చేశారు. అధికారంలో ఉంటే విధ్వంసం చేశారని... ప్రతిపక్షంలో ఉంటే బెదిరిస్తున్నారని అన్నారు. రాష్టాన్ని నాశనం చేయాలనుకుంటే.. దాన్ని కాపాడుకోవడం అందరి బాధ్యత అని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పుకొచ్చారు.

# జగన్.. మావిగన్ జోకర్

మొదటి తరువాయి




రాజశేఖరరెడ్డి 'ప్రజాప్రస్థానం' పాదయాత్ర 23 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆమె గురువారం ఎక్స్ వేదికగా స్పందించారు. "వైసీపీలో నిజంగా వైఎస్ ఐడియాలజీ ఉంటే జగన్ సీఎం అయ్యాక జల యజ్ఞాన్ని ఎందుకు పూర్తి చేయలేదు? 'మాట తప్పం... మడం తిప్పం' అన్న వైఎ?సఆర్ లైన్ మాత్రమే వాడుకున్నారు. పూర్తి మద్యపాన నిషేధమని మాట ఇచ్చి, కల్తీ మద్యం అమ్మి, 'ఓన్లీ క్యాష్' మాఫియా ఎందుకు చేశారు? వైఎస్ వ్యతిరేకించిన బీజేపీకి దత్తపుత్రుడుగా ఎందుకు మారారు? దళితులపై, క్రిస్టియన్లపై దాడులు జరుగుతుంటే, జగన్... మౌనంగా ఎందుకున్నారు? వైఎస్ ఐడియాలజీ కాంగట?ప్రతోనే సాధ్యం' అని పేర్కొన్నారు.

# ఆ నేతలకు శ్రీముఖాలు!

మొదటి తరువాయి



ఇందుకు కారణాలేంటో అడిగి తెలుసుకుని వారికి నోటీసులు జారీ చేయాలని పల్లాను మంత్రి లోకేశ్ ఆదేశించారు. అలాగే నాలుగు వారాలుగా క్యాడర్ సమావేశాలు నిర్వహించని పులివెందుల ఇన్‌చార్జి బీటెక్ రవి, కమలాపురం ఎమ్మెల్యే పుట్టా చైతన్యరెడ్డి, గ్రీవెన్స్ నిర్వహించని ధర్మవరం ఇన్‌చార్జి పరిటాల శ్రీరాంకు కూడా నోటీసులు ఇవ్వాలని స్పష్టం చేశారు. వారిచ్చే సంజాయిషీని బట్టి తదుపరి చర్యలు తీసుకోవాలని సూచించారు. పార్టీ ఇచ్చిన కార్యక్రమాలు కచ్చితంగా నిర్వహించాలని, లేకుంటే ఉపేక్షించేది లేదని లోకేశ్ స్పష్టం చేశారు.

# సంపాదకీయం

## ఒక యుద్ధం.. అనేక చేదు అనుభవాలు !



ట్రంప్, నెతన్యాహులు కలసి ప్రపంచాన్ని గందరగోళంలోకి నెట్టడమే కాకుండా ఓ రకంగా చెప్పాలంటే ఫూల్స్‌ను చేశారు. ఇరాన్ వద్ద శుద్ధి చేసిన యురేనియం నిల్వలు ఉన్నాయని ప్రపంచాన్ని నమ్మించారు. అక్కడి నాయకత్వాన్ని మార్చాలని, తద్వారా యురేనియం స్వాధీనం చేసుకుంటామని అనుకున్నారు. కానీ ఈ రెండూ పక్కకు పోయి, ఇప్పుడు హర్మూజ్ జలసంధ తెరిస్తే చాలన్నట్లుగా వ్యవహారానికి దిగారు. ఇరాన్ బిగుసుకుని కూర్చోవడంతో హర్మూజ్ జలసంధి వ్యవహారం మళ్లీ మొదటికి వచ్చింది. ఇరాన్‌ను దారిలోకి తెచ్చుకునేందుకు అనూహ్యంగా పాక్‌ను ట్రంప్ రంగంలోకి దింపారు. ఇరాన్ వద్ద ఉన్న యురేనియం స్వాధీనం చేసుకోవడం.. ఆ దేశంలో ప్రస్తుతం ఉన్న పాలకులను మార్చి తమకు అనుకూలంగా ఉండేవారిని నియమించడం.. అనే రెండు లక్ష్యాలతో అమెరికా, ఇజ్రాయెల్ ఆ దేశంపై యుద్ధాన్ని మొదలుపెట్టాయి. కానీ దాదాపు 40 రోజుల యుద్ధంలో అది నెరవేరలేదు. ఇరా నేత కమేనీ మరణించినా, ఆయన కుమారుడు మరో నేతగా ముందుకు వచ్చారు. అక్కడి ప్రజలు కూడా అమెరికాకు లొంగలేదు. నలభై రోజులు గడిచాక పరిస్థితి చూస్తే.. ఆ రెండు లక్ష్యాలనూ సాధించడంలో ట్రంప్, నెతన్యాహులు పూర్తిగా విఫలమయ్యారనే చెప్పాలి. ప్రపంచం కూడా ఇది గుర్తించింది. వాస్తవంగా చెప్పాలంటే.. రూ.లక్షల కోట్లు ఖర్చు చేసి, వందలాది మంది ప్రాణాలను బలిగొని, ప్రత్యక్షంగా గల్ఫ్ ప్రాంతాన్ని దెబ్బతీయడానికి కారణమయ్యారు. ఇంధన కొరతకు కారణమయ్యారు. పరోక్షంగా,ప్రత్యక్షంగా ప్రపంచదేశాల ఆర్థిక వ్యవస్థలను దెబ్బతీసారు. ట్రంప్ కాల్పుల విరమణను ప్రకటించిన తర్వాత కూడా ఇరాన్ క్షిపణులను ప్రయోగించడం.. చెక్కుచెదరని ఆ దేశ రాజకీయ నాయకత్వ సంకల్ప బలానికి, ఆ దేశ సైనిక సామర్థ్యానికి నిదర్శనమని రక్షణ రంగ నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఒక శక్తిమంతమైన దేశం చిన్నదేశంపై విరుచుకుపడి.. పూర్తిగా ఓడించలేకపోతే, అది ఆ చిన్నదేశం విజయం కిందే పరిగణించాలి. ఆ కోణంలో చూస్తే ఇరాన్‌ను ఈ యుద్ధంలో విజేతగానే చూడాలి. ఎందుకంటే సర్వనాశనం చేస్తామన్న ట్రంప్ తోక ముడిచారనే చెప్పాలి. స్వదేశంలో ట్రంప్ విపరీతమైన వ్యతిరేకతను ఎదుర్కొంటున్నారు. అలాగని ఈ యుద్ధంలో ఇరాన్ సంపూర్ణంగా గెలిచిందని కూడా చెప్పలేం. ఎందుకంటే ఇరాన్ భారీగానే నష్టపోయింది. అది కుదురుకోవడానికి మరో దశాబ్దం పట్టవచ్చు. ఎందుకంటే.. ఎంతో మంది ఇరాన్ పౌరులు ఈ యుద్ధంలో ప్రాణాలు కోల్పోయారు. ఆ దేశంలోని మౌలికసదుపాయాలు, చమురు క్షేత్రాలు, పారిశ్రామిక కేంద్రాలు దారుణంగా దెబ్బతిన్నాయి. దేశ అగ్ర నాయకత్వాన్ని ఇరాన్ కోల్పోయింది. ఆ దేశ అణు కేంద్రాలు ధ్వంసమయ్యాయి. ఇరాన్‌కన్నా ఎక్కువగా ఈ యుద్ధంలో నష్టపోయింది గల్ఫ్ దేశాలు. యూఏఈ, సౌదీ, కువైత్, ఇరాక్, బహరైన్‌లోని పలు ప్రాంతాలు ఇరాన్ క్షిపణులు, డ్రోన్ల దాడులకు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఒక్క యూఏఈపైనే ఇరాన్ దాదాపు 520 క్షిపణులు, 2000 కామికాజీ డ్రోన్లను ప్రయోగించింది. దీంతో, యూఏఈకి ఆర్థిక ఇంజన్లు అయిన దుబాయ్, షార్జా వంటివి తీవ్రంగా ప్రభావితమయ్యాయి. దుబాయ్ పర్యాటక, రియల్ ఎస్టేట్ రంగాలు కుప్పకూలాయి. అటు.. సౌదీ వద్దనున్న అత్యాధునిక అమెరికన్ ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్.. ఇరాన్ దాడులను పూర్తిగా అడ్డుకోలేకపోయాయి. ఫలితంగా సౌదీలోని రాస్‌తనూరా వంటి చమురుశుద్ధి కర్మాగారాలు, పలు పారిశ్రామిక ప్రాంతాలు దెబ్బతిన్నాయి. అమెరికా, ఇజ్రాయెల్ కాస్త తగ్గి, చర్చలకు రావడానికి.. గల్ఫ్ దేశాలపై ఇరాన్ చేసిన ఈ దాడులు కూడా ఒక కారణం. ఈ యుద్ధం వల్ల అమెరికా ఆర్థికంగా నష్టపోవడమే కాదు. ఆ దేశ పరపతి కూడా పోయింది. ఇకపై అమెరికా సైనికశక్తిని చూసి గతంలో భయపడినట్టుగా ఎవరూ భయపడే పరిస్థితి ఉండదు. ఇకపోతే యుద్ధం జరుగుతుండగా.. ప్రపంచ చమురు రవాణాకు అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధిపై ఇరాన్ పట్టుబిగించి, రాకపోకలను కట్టడి చేయడంతో ఓ రకంగా చెప్పొంటే ట్రంప్‌కు ముచ్చెమటలు పట్టాయనే చెప్పాలి. అంతేగాకుండా ఇరాన్ ఎదురుదాడిని కూడా అమెరికా ఊహించి ఉండలేదు. నోటికొచ్చినట్టు మాట్లాడిన ట్రంప్.. ఇప్పుడు ర్మూజ్ జలసంధిని తెరవాలంటూ పదేపదే బెదిరింపులు జారీ చేశారు. అదీ జరగలేదు. యుద్ధం మొదలైనరోజే సుప్రీం లీడర్ ఆయతొల్లా ఖమేనీ చనిపోయినా.. ఆయన కుమారుడు మొజ్తబాకు పట్టంగట్టి ఇరాన్ ఈ యుద్ధాన్ని కొనసాగించింది. కాలక్రమంలో అగ్రనాయకులు ఎందరు మరణించినా.. యుద్ధాన్ని మాత్రం ఆపలేదు! ఓ రకంగా చెప్పాలంటే అమెరికాను సవాల్ చేసింది. ఒక దశలో తన దూకుడుతో అమెరికావిమానవాహక యుద్ధనౌకను సైతం వెనక్కి తగ్గేలా చేసింది. మా మీదకి దాడికి వస్తే.. ఈ ప్రాంతంలో నీ మిత్రదేశాలను నేను దెబ్బతీస్తా అని గల్ఫ్ దేశాలకు ముడిపెట్టి హెచ్చరించింది. దాడులు చేసి అమెరికాను నిలువరించ గలిగేలా ఎదురుదాడులతో బెంబేలు పెట్టింది. అత్యంత శక్తిమంతమైన అమెరికా సైన్యాన్ని, అత్యాధునిక సాంకేతికత కలిగిన ఇజ్రాయెల్‌ను ఎదుర్కొని ఇరాన్ తన ఉనికిని కాపాడుకుంది. బెరుకు లేకుండా యుద్ధం లోకి దిగింది. ఇప్పుడు లెబనాన్‌పై దాడులను ఆపకుంటే ర్మూజ్ తెరిచేది లేదని ఉడుంపట్టు పట్టింది. అమెరికా, ఇజ్రాయెల్ కలసి ఇరాన్‌లోని అణు కేంద్రాలను ధ్వంసం చేసి ఉండవచ్చు. కానీ ఇరాన్ వద్ద ఉన్న శుద్ధి చేసిన యురేనియంను మాత్రం స్వాధీనం చేసుకోలేకపోయాయి. ప్రపంచ చమురు రవాణాకు అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధిపై ఇరాన్‌కు గతంలో లేని పట్టు ఇప్పుడు రావడానికి ఈ యుద్ధమే కారణమైంది. ఇప్పుడా మార్గంలో టోల్ వసూలు ప్రతిపాదన ద్వారా దానిపై శాశ్వత నియంత్రణకు ఇరాన్ ప్రయత్నాలు చేస్తోంది. హోర్ముజ్ జలసంధిపై ఇరాన్ తన పట్టును కొనసాగించి, పూర్తిగా నియంత్రించ గలిగితే.. ఆ దారి గుండా ఎగుమతి, దిగుమతులకు యూఏఈ పూర్తిగా ఇరాన్ దయాదాక్షిణ్యాలపై ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంటుంది.

# హజ్ యాత్ర-2026 కు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి




అధికార యంత్రంగాన్ని రాష్ట్ర న్యాయ,మైనారిటీ సంక్షేమ శాఖల మంత్రి ఫరూక్ ఆదేశించారు. గురువారం గన్నవరం ఎస్ఎం కన్వెన్షన్ హాల్ లో హజ్ క్యాంప్ -2026 కు ఏర్పాట్లపై మైనారిటీ సంక్షేమ శాఖ కార్యదర్శి సిహెచ్ శ్రీధర్ అధ్యక్షతన సమీక్ష జరిగింది. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో టిడిపి ప్రభుత్వ హయాంలో హైదరాబాద్ నగర నడిబొడ్డున అన్ని సౌకర్యాలతో హజ్ భవన్ నిర్మించడం జరిగిందన్నారు. అప్పట్లో హైదరాబాదులో కూడా ఎంబార్కేషన్ కేంద్రం ఉండేది కాదని, అప్పటి ప్రధాని వాజ్ పేయి దృష్టికి ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకువెళ్లడంతో ఏంబార్కేషన్ కేంద్రం మంజూరు అయిందని గుర్తు చేశారు. రాష్ట్ర విభజన అనంతరం ఏపీ ప్రయాణికులకు ఏంబార్కేషన్ కేంద్రం అందుబాటులో లేకపోవడంతో ఇతర రాష్ట్రాలలోని కేంద్రాలకు వెళ్లాల్సి వస్తున్నదన్నారు. ఈ విషయంపై సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా కేంద్రం దృష్టికి సమస్యను తీసుకువెళ్లి విజయవాడకు ఏంబార్కేకేషన్ కేంద్రం మంజూరు చేయించారని అన్నారు.ఈ సందర్భంగా ప్రధాని మోదీ గారికి, ముఖ్యమంత్రి చంద్రబాబుకి, కేంద్ర మైనారిటీ శాఖ మంత్రి కిరణ్ రిజిజు గారికి , పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు గారికి మంత్రి ఫరూక్ ధన్యవాదాలు తెలిపారు.పవిత్ర మక్కాయాత్ర హజ్ కు వెళ్లే యాత్రికులందరికీ, అన్ని రకాల మౌలిక సదుపాయాలతో విజయవాడలో హజ్ హౌస్ నిర్మించేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సారధ్యంలోని కూటమి ప్రభుత్వం నిర్ణయించిందని రాష్ట్ర న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ పేర్కొన్నారు. విజయవాడ నుంచి హజ్ కి వెళ్లే ప్రయాణికులు అందరికీ రూ. లక్ష ఆర్థిక సాయం కూటమి ప్రభుత్వం అందిస్తున్నదని, ముఖ్యమంత్రి చంద్రబాబుకు ముస్లిం మైనారిటీల తరఫున ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు మంత్రి ఫరూక్ పేర్కొన్నారు.

**పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అధికారులకు మంత్రి ఆదేశం**

రాష్ట్రం నలుమూలల నుండి విజయవాడకు చేరుకునే ప్రయాణికులందరికి ఏర్పాటు చేసే క్యాంప్ లో హజ్ యాత్ర విజయవంతం కోసం అనుసరించాల్సిన నియమ నిబంధనలు, పద్ధతులు, వ్యవహరించాల్సిన తీరును విశదీకరించాలని సూచించారు. విజయవాడ నుండి మదీనాకు ప్రత్యేక విమానాల ఏర్పాటు, యాత్రికుల బోర్డింగ్ వివరాలను హజ్ కమిటీ ద్వారా ఎప్పటికప్పుడు సమాచారం అందించాలన్నారు. యాత్రికుల లగేజీని వేగంగా తరలించేలా చూడాల్సిన ఏర్పాట్లపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచించారు.విమానాశ్రయంలోహజ్ యాత్రికుల కోసం ప్రత్యేక కౌంటర్లు, విడిగా అరైవల్/ డిపార్చర్ లాంజ్-లను, నమాజు వసతిని కేటాయించాలని, చెక్-ఇన్ ప్రక్రియ కోసం అదనపు సిబ్బందిని నియమించాలని, ప్రయాణికుల రాకపోకల విషయంలో హజ్ కమిటీతో సమన్వయం చేసుకోవాలన్నారు. హజ్ వీసాలను త్వరితగతిన క్లియర్ చేసేందుకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలన్నారు.గ్రూపుల కోసం ముందస్తు క్లియరెన్స్ సౌకర్యం కల్పించాలని పాస్ పోర్ట్ వెరిఫికేషన్ కోసం 24/7 సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. యాత్రికుల కోసం భద్రతా ప్రోటోకాల్ ను పెంచాలని, మహిళా యాత్రికుల కోసం ప్రత్యేక మహిళా సిబ్బందితో తనిఖీలు నిర్వహించాలని సూచించారు. క్యాంప్ లు,లాంజ్-ల వద్ద సిసిటివి నిఘా ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు పరిస్థితి ని సంబంధిత అధికార యంత్రాంగం తెలుసుకుంటూ అందుకు అనుగుణంగా చర్యలు అమలు చేయాలని మంత్రి ఆదేశించారు. కరెన్సీ మార్పిడి, హజ్ చెల్లింపుల కోసం క్యాంప్ తో పాటు విమానాశ్రయం వద్ద తగినన్ని కౌంటర్లు ఏర్పాటు చేయాలన్నారు. యాత్రికులకు ఎటువంటి అదనపు రుసుము లేకుండా మార్పిడి సౌకర్యం, డిజిటల్ బ్యాంకింగ్ మద్దతు అందించాలని ఆదేశించారు.

**ప్రత్యేకంగా బస్సులు నడపాలి**

హజ్ యాత్రకు వెళ్ళేందుకు విజయవాడకు చేరుకునే యాత్రికులు అందరూ క్యాంప్ నుండి విమానాశ్రయం కు ఇబ్బందులు లేకుండా చేరుకునేలా ప్రత్యేక ఏసీ బస్సులను నడపాలని మంత్రి ఫరూక్ ఆదేశించారు. క్యాంప్, విమానాశ్రయం వద్ద తగినంత మంది వైద్యులు, నర్సులను అందుబాటులో ఉంచి, ప్రయాణానికి ముందు తప్పనిసరి ఆరోగ్య పరీక్షలు, ఉచిత వ్యాక్సినేషన్లు అందించాలన్నారు. అంబులెన్స్ లను సిద్ధంగా ఉంచాలన్నారు.

**భద్రత ఏర్పాట్లను పగడ్బందీగా చేయాలి**

హజ్ యాత్ర క్యాంప్ వద్ద తగినంత భద్రతా సిబ్బందితో ఏర్పాట్లను పకడ్బందీగా చేయాలని పోలీస్ శాఖకు మంత్రి ఫరూక్ సూచించారు. నేషనల్ హైవే-16 పై ట్రాఫిక్ మళ్లింపులు చేపట్టాలని, యాత్రికులకు రక్షణ కల్పించడంతో పాటు, మోసాలకు పాల్పడే సైబర్ నేరగాళ్లపై నిఘా ఉంచాలన్నారు.క్యాంప్ వద్ద అంతరాయం లేని విద్యుత్ సరఫరా, బ్యాకప్ జనరేటర్లను సిద్ధం చేయాలన్నారు.లాంజ్-లలో 24/7 లైటింగ్ మరియు ఏసీ సౌకర్యం ఉండేలా చూడాలని ఆదేశించారు.

ప్రతిరోజు సరిపడా ఆర్.ఓ తాగునీటిని సరఫరా చేయాలని,క్యాంప్ వద్ద తగినన్ని మరుగుదొడ్లు, స్నానపు గదులు ఏర్పాటు చేసి, రోజువారీ పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించాలన్నారు. అగ్నిమాపక శాఖ అప్రమత్తంగా ఉండాలని క్యాంప్, వద్ద, విమానాశ్రయం వద్ద ఫైర్ ఇంజన్ల వాహనాలను అందుబాటులో ఉంచాలాన్నారు.మాక్ డ్రిల్స్ నిర్వహించాలని, అత్యవసర పరిస్థితుల్లో ఖాళీ చేసే విధానాలపై వాలంటీర్లకు శిక్షణ ఇవ్వాలన్నారు. యాత్రికుల మార్గాల్లో సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. సమాచార శాఖ ఆధ్వర్యంలో హజ్ అప్డేట్స్ కోసం రోజువారీ మీడియా బులెటిన్లను విడుదల చేయాలని,సోషల్ మీడియా, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా, తదితర సమాచార మార్గాల ద్వారా చేసి, ఎప్పటికప్పుడు సరైన సమాచారాన్ని ప్రజలకు చేరవేయాలన్నారు.అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో హజ్ యాత్ర విజయవంతం కోసం భాగస్వాములై యాత్రికులు అందరికీ ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి ఫరూక్ ఆదేశించారు.ఈ సమీక్షలో హజ్ కమిటీ చైర్మన్ హసన్ భాష, ఉర్దూ అకాడమీ చైర్మన్ ఫారూఖ్ షుబ్లీ, వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ , హజ్ కమిటీ సభ్యులు, హజ్ కమిటీ సీఈఓ గౌస్ పీర్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాల సన్నాహక సమావేశం



**దేవరకొండ ఏప్రిల్ 9(డ్రీమ్ టైమ్స్):** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని దేవరకొండ తహసీల్దార్ కార్యాలయంలో ముందస్తు సమీక్షా సమావేశం నిర్వహించారు. 2026 ఏప్రిల్ 14న నిర్వహించబోయే నియోజకవర్గ స్థాయి జయంతి వేడుకల ఏర్పాట్లపై తహసీల్దార్ మధుసూదన్ రెడ్డి అధ్యక్షతన ఈ సమీక్ష జరిగింది. ఈ కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ కరుణశ్రీ, సీఐ వెంకట్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ పూర్ణచందర్ పాల్గొని మాట్లాడారు. అంబేద్కర్ జయంతి వేడుకలను నియోజకవర్గస్థాయిలో ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఎలాంటి అసౌకర్యం కలగకుండా మున్సిపల్ శాఖ పర్యవేక్షిస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వివిధ దళిత , ప్రజా సంఘాలు మరియు సంఘాల నాయకులు పాల్గొని వేడుకల నిర్వహణపై పలు సూచనలు చేశారు. అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా నియోజకవర్గ స్థాయిలో ఈ ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్లు నాగరాజు, పుల్యా, పరంజ్యోతి, దిలీప్, పవన్ పాల్గొని విద్యార్థి వసతి గృహాల్లో నిర్వహించబోయే కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. ఈ సమీక్షా సమావేశంలో బహుజన మేధావి డాక్టర్ యేకుల రాజారావు, దేవయ్య, వివిధ ప్రజా సంఘాల నాయకులు యేకుల సురేష్, అంకురి శివ, మద్దిమడుగు భిక్షపతి, కంబాల పల్లి వెంకటయ్య, ప్రసాద్, ఎర్ర అంజనేలు , పీటర్, లక్ష్మయ్య మరియు మాజీ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

# రైతుల భూ సమస్యలను పరిష్కరించేందుకై రైతు సంక్షేమ కమిషన్ కృషి

**అమ్రాబాద్, ఏప్రిల్ 9(డ్రీమ్ టైమ్స్):** నల్లమల్ల ఏజెన్సీ ప్రాంత రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ కృషి చేస్తుందని కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి తెలిపారు. అమ్రాబాద్ మండల కేంద్రంలో జరిగిన రైతు సదస్సులో ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాల్లో భూమి హక్కుల గుర్తింపు, పత్రాల సమస్యలు, సాగు భూముల వివాదాలు రైతులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయని, ఈ సమస్యలను నేరుగా రైతుల వద్దకు వెళ్లి తెలుసుకొని పరిష్కార మార్గాలను సూచించేందుకు కమిషన్ క్షేత్రస్థాయి పర్యటనలు చేపట్టిందని చెప్పారు. రైతుల భూ సమస్యలను సమగ్రంగా పరిశీలించి, ముఖ్యంగా గిరిజన రైతుల హక్కులను రక్షించేందుకు ప్రభుత్వం వద్ద నివేదిక సమర్పిస్తామని, రైతుల సంక్షేమం కోసం కమిషన్ కట్టుబడి పనిచేస్తుందని ఆయన స్పష్టం చేశారు. గత ప్రభుత్వ నిర్ణయాల వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని, ప్రస్తుత ప్రభుత్వం రైతులకు న్యాయం జరిగేలా కృషి చేస్తోందని తెలిపారు.జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంత రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి సక్సెషన్ ప్రక్రియలను పూర్తి చేసి బ్యాంకులతో సమన్వయం చేసి రుణాలు అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ ఈ ప్రాంత రైతుల భూ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాల్సిన అవసరం ఉందని, కమిషన్ కృషి చేస్తున్నందుకు సంతోషం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో రైతు కమిషన్ సభ్యులు, అదనపు కలెక్టర్ అమరేందర్, అచ్చంపేట ఆర్డిఓ యాదగిరి, స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

## మహిళల మనోభావాలతో ఆటలాడొద్దు..!

ఏబీఎన్ రాధాకృష్ణకు గుంతకల్లు తాజా మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్, వైసిపి జిల్లా ఉపాధ్యక్షురాలు వై. నైరుతి రెడ్డి హితవు



**గుంతకల్లు, ఏప్రిల్ 9(డ్రీమ్ టైమ్స్):** మహిళల మనోభావాలతో ఆటలాడొద్దని ఏబీఎన్ ఆంధ్రజ్యోతి రాధాకృష్ణకు గుంతకల్లు తాజా మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్, వైసిపి జిల్లా ఉపాధ్యక్షురాలు వై. నైరుతి రెడ్డి హితవు పలికారు. ఈ మేరకు ఏబీఎన్ ఆంధ్రజ్యోతి రాధాకృష్ణ తన తొలి పలుకు వ్యాస కథనంలో మహిళలను కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేశారని ఆయనపై చర్యలు తీసుకోవాలని అరెస్టు చేయాలని కోరుతూ గురువారం గుంతకల్లులో నైరుతి రెడ్డి వైసీపీ నాయకులు కార్యకర్తలుతో కలిసి స్థానిక డిఎస్పి కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. అంతకుముందు స్థానిక వైసిపి మాజీ ఎమ్మెల్యే వై. వెంకట్రామిరెడ్డి క్యాంపు కార్యాలయం నుండి బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నైరీ రెడ్డి మాట్లాడుతూ ఒక పత్రికాధిపతి ప్రజాప్రయోజనార్థం వ్యాస కథనాలు ప్రచురించాలే తప్ప ఒక పార్టీకి కొమ్ము కాస్తూ ప్రజల మనోభావాలు దెబ్బతినేలా వ్యవహరించకూడదని ఆమె పేర్కొన్నారు. గత వైసిపి ప్రభుత్వంలో జగన్మోహన్ రెడ్డి మహిళలకు పెద్దపీట వేశారన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం మహిళల పట్ల పక్షపాతం వహిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మాజీ ప్రజాప్రతినిధులు, తాజా మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జన గణన పై శిక్షణ




**గుంతకల్లు, ఏప్రిల్ 9(డ్రీమ్ టైమ్స్):** జనగణన సెన్సెస్ - 2027 కు సంబంధించి పట్టణంలోని శ్రీ శంకర నందగిరి స్వామి డిగ్రీ కళాశాలలో గురువారం ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జనగణనకు సంబంధించి సంబంధించి ఆర్డిఓ శ్రీనివాస్, మాస్టర్ ట్రైనర్స్ శిక్షణ ఇచ్చారు ఈ కార్యక్రమంలో తహ శీల్దారు, తదితర అధికారులు, ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లు పాల్గొన్నారు.


## బాలుడి మృతదేహం పోలీసులకు అప్పగించిన అగ్నిమాపక సిబ్బంది




**గుంతకల్లు, ఏప్రిల్ 9 (డ్రీమ్ టైమ్స్):** గుంతకల్లు పట్టణ శివారులోని ఆలూరు రోడ్డులో లో ఉన్న సమ్మర్ స్టోరేజ్ రిజర్వాయర్ ట్యాంకు నుండి గుంతకల్లు పట్టడానికి చెందిన జి.దీపక్(10) మృతదేహాన్ని గుంతకల్లు అగ్నిమాపక సిబ్బంది పోలీసులకు అప్పగించారు. గుంతకల్లు పట్టణానికి చెందిన జి. ఆంజనేయులు కుమారుడు గుంతకల్లు పట్టణ శివారులోని ఆలూరు రోడ్డులో లో ఉన్న సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ లో పడ్డారన్న సమాచారం విజయవాడ కంట్రోల్ రూమ్ నుండి గురువారం సాయంత్రం గుంతకల్లు అగ్నిమాపక సిబ్బందికి అందింది. దీంతో స్థానిక అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఆలూరు రోడ్డులో ఉన్న సమ్మర్ స్టోరేజ్ రిజర్వాయర్ ట్యాంక్ నుండి దీపక్ మృతదేహాన్ని బయటకు తీసి పోలీసులకు అప్పగించారు.

## పెద్దమ్మ జాతర

**ఆళ్లగడ్డ ఏప్రిల్ 9(డ్రీమ్ టైమ్స్):** ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని రుద్రవరం గ్రామంలో ఈనెల 20 21 తేదీలలో పెద్దమ్మ జాతర నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు పెద్దమ్మ జాతర ప్రశాంతంగా జరిగేందుకు ప్రజలు సహకరించాలని నిర్వాహకులు కోరారు




## ఘనంగా మాజీ సీపీఐ కేంద్ర ప్రధాన కార్యదర్శి, చంద్ర రాజేశ్వరరావు 32 వ వర్ధంతి

**గుంతకల్లు, ఏప్రిల్ 9(డ్రీమ్ టైమ్స్):** మాజీ సిపిఐ కేంద్ర ప్రధాన కార్యదర్శి చంద్ర రాజేశ్వరరావు వర్ధంతి గురువారం స్థానిక సిపిఐ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నేతలు మాట్లాడుతూ కృష్ణాజిల్లా మంగళాపురంలో 1915 జూన్ 6వ తేదీన సుబ్బయ్య దంపతులకు 3 వ సంతానం చంద్ర రాజేశ్వరరావు జన్మించారన్నారు. ఆయన ఆ పెద్ద భూస్వామి కుటుంబంలో జన్మించి, చదువుకున్న రోజుల నుండి విద్యార్థుల ,రైతాంగ సమస్యలపై దృష్టిని సారించి పోరాటాలు చేశారన్నారు. విశాఖలో మెడిసిన్ పూర్తిచేసి తెలంగాణ భూస్వాములపై వ్యతిరేక పోరాటాలు చేసి పేద ప్రజలకు భూములు పంపిణీలో కీలక పాత్ర వహించారు. అదేవిధంగా సిపిఐ అనుబంధంగా ఉన్న జన సేవాదళ్ ఏర్పాటు చేసి, సిపిఐ పార్టీకి ఆకర్షితులై ఎంతోమంది



యువకులను పార్టీలోకి వచ్చేలా చేశారు. తనకు సంక్రమించిన పెద్దల ఆస్తిని పూర్తిగా పార్టీకి అంకితం చేశారన్నారు. 1964లో సీపీఐ పార్టీ చీలికతో పార్టీ సంక్షోభంలోకి వెళ్లిపోకుండా సిపిఐ జెండాను నిలబెట్టారు. ఆర్డర్ ఆఫ్ లెనిన్అవార్డును కూడా పొందారు. భారత కమ్యూనిస్టు పార్టీ కేంద్ర ప్రధాన కార్యదర్శిగా 28 సంవత్సరాలు సుదీర్ఘ కాలంగా బాధ్యతలు వహించారు .ఏప్రిల్ 9 1994లో హైదరాబాదులో తుది శ్వాస విడిచారన్నారు. ఆయన జ్ఞాపకార్థం హైదరాబాదులో సి ఆర్ ఫౌండేషన్ పేరుతో వృద్ధాశ్రమం నేటికీ నడుస్తోందన్నారు ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వీరభద్ర స్వామి, పట్టణ కార్యదర్శి ఎస్ఎండి గౌస్, రాష్ట్ర హమాలీ యూనియన్ సహాయ కార్యదర్శి మహేష్, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి కుల్లాయప్ప, పట్టణ సహాయ కార్యదర్శి మురళీకృష్ణ, మండల సహాయ కార్యదర్శి రామాంజనేయులు యాదవ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి దేవేంద్ర, ఏఐటియుసి మండల కార్యదర్శి ఈశ్వరయ్య, ఆటో యూనియన్ గౌరవాధ్యక్షుడు దాసరి శీన, రైతు సంఘం నాయకుడు ఉమర్ బాష, హమాలి యూనియన్ నాయకులు పెద్దయ్య గురుస్వామి, రామంజి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ 106 వ జయంతి వేడుకలు





-'పేదల పెన్నిధి ఫాదర్ ఫెర్రర్ ఆశయ సాధనే లక్ష్యం
- ఆర్ డీ టీ 106వ జయంతి వేడుకల్లో ప్రతిజ్ఞ"

**తనకల్లు ఏప్రిల్ 9 డ్రీమ్ టైమ్స్ న్యూస్.** అనంతపురం కేంద్రంగా విశేష సేవలందిస్తున్న రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ వ్యవస్థాపకులు ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ 106వ జయంతి వేడుకలు తనకల్లు మండలంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏరియా ప్రోగ్రాం కోఆర్డినేటర్ సుకన్య మాట్లాడుతూ మానవత్వమే మతంగా, పేదల సేవయే పరమావధిగా జీవించిన మహోన్నత వ్యక్తి, ఆర్ డి టి వ్యవస్థాపకులు ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ 106వ జయంతి వేడుకలు జిల్లా వ్యాప్తంగా అత్యంత ఘనంగా నిర్వహించబడ్డాయని ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆర్ డి టి కేంద్రాల్లో పండుగ వాతావరణం నెలకొందని ఈ కార్యక్రమంలో భాగంగా తనకల్లు మండలంలోని ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ విగ్రహానికి సంస్థ ప్రతినిధులు లబ్ధిదారులు, సంఘం ఉపాధ్యాయులు,గ్రూప్ లీడర్లు, సంఘ సభ్యులు ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించామని తెలిపారు. ఆర్ డి టి స్కూల్స్, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో విన్సెంట్ ఫెర్రర్ జీవిత విశేషాలను, ఆయన చేసిన సామాజిక సేవలను సంఘం ఉపాధ్యాయులు వివరించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ, "ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ చూపిన బాటలో నడుస్తూ, అనంతపురం జిల్లాలోని వెనుకబడిన వర్గాల అభివృద్ధికి, విద్య, వైద్యం, మహిళా సాధికారతకు ఆర్ డి టి నిరంతరం కృషి చేస్తూనే ఉంటుంది. ఆయన ఆశయాలను కొనసాగించడమే మనం ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి" అని పేర్కొన్నారు. ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ జయంతి వేడుకలో ఏరియా ప్రోగ్రాం కోఆర్డినేటర్ సుకన్య, కమ్యూనిటీ ఆర్గనైజర్ కుషీధా, కోటిరెడ్డి,ఇంజనీర్ బషీర్, సంఘం ఉపాధ్యాయులు ఈతోడు అరుణ, భవాని, దొడ్డప్ప, రామచంద్ర, కొండయ్య, గ్రూప్ లీడర్లు, మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## జనాభాగణన ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలి.

**శిరివెళ్ళ(.డ్రీమ్ టైమ్స్)** మండల పరిధిలోని ఆయా గ్రామాలకు కేటాయిస్తున్నటువంటి ఎనిమిరేటర్లు సూపర్వైజర్లు సంబంధిత జన గణన సిబ్బంది జనాభా గణన ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని తహసిల్దార్ ఐ విజయశ్రీ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని స్థానిక ఏపీ మోడల్ స్కూల్ సమావేశ భవనంలో నిర్వహించినటువంటి శిక్షణ కార్యక్రమానికి సూపర్వైజర్లు ఎన్యుమరేటర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా తహసిల్దార్ ఐ.విజయశ్రీ మాట్లాడుతూ భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న 16వ జనాభా గణన ప్రక్రియ పై సంబంధిత యాప్ మరియు నైపుణ్యత వివరాల పై శిక్షణకార్యక్రమంనిర్వహిస్తున్నామని అన్నారు. ప్రతి బ్యాచ్ కి నిర్వహించే మూడు రోజుల శిక్షణా కార్యక్రమాలలో జనాభగణన డేటా సేకరణపై అధికారులు పూర్తి అవగాహన నైపుణ్యత పెంపొందించుకోవాలని తహసిల్దార్ పిలుపునిచ్చారు. జనగణన ప్రక్రియలో భాగంగా



డేటా సేకరణలో ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రభుత్వం అప్పగించిన జన గణన ప్రక్రియను బాధ్యతయుతంగా నిర్వహించి విజయవంతం చేయాలని కోరారు. బోయలకుంట్ల, చెన్నూరు, గంగవరం, మహదేవపురం, వనికందిన్నె జీనపల్లె తదితర గ్రామాలకు సంబంధించిన సూపర్వైజర్లు ఎనిమరేటర్లకు ట్రైనర్స్ లకు అవగాహన కార్యక్రమాన్ని గురువారం ఏర్పాటు చేశారు. జనగణన ప్రక్రియను పారదర్శకంగా, లోప రహితంగా పూర్తి చేసి మండలానికి మంచి పేరు తీసుకురావాలని పిలుపునిచ్చారు. జనగణన ద్వారా సేకరించే గణాంకాలు అభివద్ధి ప్రణాళికల రూపకల్పనకు పునాది వంటివన్నారు. అభివృద్ధి సంక్షేమ పథకాలు నిజమైన అర్హులకు చేరవేయడానికి ఖచ్చితమైన గణాంకాలు ఎంతగానో దోహదపడుతుందన్నారు. మొదటి దశలో ఇళ్ల జాబితా సేకరణ, రెండో దశలో జనాభా వివరాల సేకరణ ఉంటాయన్నారు. ప్రతి ఎన్యూమరేటర్ తనకు కేటాయించిన లాగిన్ వివరాలతో యాప్‌ను సక్రమంగా నిర్వహించడం, డేటా ఎంట్రీ, సర్వర్‌కు లింక్ చేయడం నైపుణ్యత పెంపొందించుకోవాలని తహసిల్దార్ ఐ విజయశ్రీ సూచించారు. వయస్సు, విద్యార్హత, వృత్తి, సామాజిక వర్గం, మౌలిక వసతుల వివరాలు వంటి అంశాల్లో ఎటువంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్త వహించాలన్నారు. ఖచ్చితమైన సమాచారం మాత్రమే నమోదు చేయాలని గృహ నిర్మాణం, నీటి వనరు, మరుగుదొడ్డి, విద్యుత్, వంట ఇంధనం, ఇంటర్నెట్ సౌకర్యం వంటి 33 అంశాలపై సమగ్ర సమాచారం సేకరనకు పూర్తి అవగాహనతో అడుగు వేయాలన్నారు.

## నూతన ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు కు సన్మానం

**ఆమనగల్లు, ఏప్రిల్ 9(డ్రీమ్ టైమ్స్):** ఆమనగల్లు ఎస్.హెచ్.ఓ గా ఇటీవల బదిలీపై ఆమనగల్లు పోలీస్ స్టేషన్ వచ్చిన వెంకటేశ్వర్లు ను గురువారం మున్సిపాలిటీ పరిధిలోని విఠయిపల్లి పెంట తండాకు చెందిన బీఆర్ఎస్ పార్టీ గ్రామ




అధ్యక్షుడు శంకర్ నాయక్, యువ నాయకుడు కొమ్ము ప్రసాద్ ల ఆధ్వర్యంలో శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఎస్.హెచ్.ఓ ను సన్మానించిన వారిలో యువకులు శ్రీను, జగన్ ఉన్నారు.

# వైసీపీ హయాంలో జరిగిన రీ సర్వే తప్పిదాలపై గ్రీవెన్స్ లో ఫిర్యాదు

-మామిడి తోటపై కన్నేసిన కబ్జాదారులు..
భూమిని ఆక్రమించి అక్రమ కట్టడాలు
-గుంటూరులో దౌర్జన్యం..
ఇల్లు కట్టుకోనివ్వకుండా ఒంటరి మహిళకు వేధింపులు
-అర్జీలు స్వీకరించి సమస్యల పరిష్కారానికి కృషి చేసిన నేతలు
-న్యాయ, మైనారిటీ సంక్షేమ మంత్రి ఎన్.ఎం.డి ఫరూక్, ఏపీ మాదిగ వెల్ఫేర్ కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్ ఉండవల్లి శ్రీదేవి





**మంగళగిరి,ఏప్రిల్ 9(డ్రీమ్ టైమ్స్):**
కర్నూలు జిల్లా హోళగుంద మండలం మద్దిలింగదహళ్ళి గ్రామానికి చెందిన వీరనాగప్ప గురువారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన ప్రజావినతుల స్వీకరణ కార్యక్రమంలో నేతలకు అర్జీ ఇచ్చి అభ్యర్థిస్తూ.. తమ గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నెం. 49 లా1లో మొత్తం 3.50 ఎకరాల భూమి ఉంది. అయితే గత ప్రభుత్వంలో జరిగిన రీ-సర్వే సమయంలో అధికారులు చేసిన పొరపాటు వల్ల రికార్డుల్లో కేవలం 3.31 ఎకరాలు మాత్రమే నమోదయ్యింది. అంటే దాదాపు 19 సెంట్ల భూమి రికార్డుల నుండి తొలగించారు. ఈ తప్పును సరిదిద్ది, పాత విస్తీర్ణం ప్రకారం 19 సెంట్లను తిరిగి కలపాలని కోరుతూ జిల్లా గ్రీవెన్స్, ఆర్.డీ.ఓ, తహసీల్దార్, గ్రామ సచివాలయ సర్వేయర్ గారికి అనేకసార్లు విన్నవించుకున్నాను. అయినా ఇప్పటివరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. మరోవైపు, పొలం సరిహద్దుల్లో ఉన్న వ్యక్తుల నుండి తనకు వేధింపులు ఎదురవుతున్నాయి. దీనిపై రక్షణ కోరుతూ పోలీసు అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ విచారణ చేయలేదు. కావున వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని నేతలు న్యాయ, మైనారిటీ సంక్షేమ మంత్రి ఎన్.ఎం.డి ఫరూక్, ఏపీ మాదిగ వెల్ఫేర్ కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్ ఉండవల్లి శ్రీదేవిలకు అర్జీ ఇచ్చి అభ్యర్థించారు.విజయనగరం జిల్లా రాజాం మండలం గోపాలపురం గ్రామానికి చెందిన శ్రీనివాసరావు గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. తమ గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 95/1 లో తమకు మొత్తం 57 సెంట్ల మామిడి తోట ఉండేది. ఇందులో 11 సెంట్లు భూమిని 1984లోనే వేరే వ్యక్తికి విక్రయించాము. మిగిలిన 46 సెంట్ల భూమి తమ హక్కు భుక్తంలో ఉంటూ వస్తోంది. అయితే ఈ భూమిని ఆక్రమించే ఉద్దేశంతో కొందరు వ్యక్తులు చుట్టూ ప్రహరీ గోడను నిర్మించారు. గోడ కడుతున్న సమయంలో తాము వెళ్లి అడ్డుకున్నా, వారించమని కోరినా వినకుండా.. దౌర్జన్యంగా నిర్మాణం పూర్తి చేశారు. తమకున్న కొద్దిపాటి జీవనాధారమైన ఈ భూమిని తమకు దక్కకుండా చేస్తున్నారు. కావున వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని కోరాడు.గుంటూరుకు చెందిన షేక్ హాలీమాబీ గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. 4-05-1996వ తేదీన షేక్ అమనాబి గారి వద్ద 133.5 గజాల ఖాళీ స్థలాన్ని కొనుగోలు చేశాను. 2004లో తన భర్త చనిపోయినప్పటి నుండి తన ఐదుగురు కుమారులతో కలిసి అక్కడే నివసిస్తున్నాను. గతంలో తన భర్త వేసిన రేకుల ఇల్లు పాడైపోవడంతో, ఇప్పుడు కొత్తగా ఇల్లు నిర్మించుకోవడానికి ప్రయత్నిస్తుండగా షేక్ నసీర్ అహ్మద్ అనే వ్యక్తి అడ్డుపడుతున్నారు. ఈ స్థలం తనదని, రోడ్డులో భాగం కూడా తనకే చెందుతుందని చెబుతూ తనపై తన పిల్లలపై దౌర్జన్యానికి దిగుతున్నారు. ఏ అధికారికి చెప్పుకున్నా నన్ను ఏమీ చేయలేరంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారు. పైగా, వారే తమపై దాడి చేస్తూ కాలనీ పెద్దల ముందు తాము వారిపై దాడి చేసినట్లు అబద్ధాలు ప్రచారం చేస్తున్నారు. తన వద్ద ఈ స్థలానికి సంబంధించి వక్ఫ్ బోర్డ్ ఇచ్చిన ప్లాట్ అలాట్‌మెంట్ కాపీ, కొనుగోలు అగ్రిమెంట్, మున్సిపల్ పన్ను రసీదులు, కరెంటు మీటర్ బిల్లులు, పొజిషన్ సర్టిఫికేట్ అన్నీ ఉన్నాయి. చివరికి 2011లో గృహ నిర్మాణ శాఖ వారు ఇల్లు కట్టుకోవడానికి ఇచ్చిన అనుమతి పత్రాలు కూడా తన వద్ద ఉన్నాయి. అన్ని ఆధారాలు ఉన్నప్పటికీ ఒంటరి మహిళను కావడంతో మానసిక ఆందోళనకు గురిచేస్తున్నారు. కావున వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని కోరారు. గుంటూరు జిల్లా మేడికొండూరుకు చెందిన నల్లూరి సామ్రాజ్యం గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ..తాము సాయిరాం మహిళా గ్రూపు సభ్యులుగా డ్వాక్రా స్త్రీ నిధి రుణాన్ని తీసుకున్నాము. తీసుకున్న అప్పును వడ్డీతో సహా పూర్తిగా జమ చేశాము. అయితే, అధికారులు అదనపు వడ్డీ చెల్లించాలని వేధించడంతో.. దీనిపై వివరణ కోరగా సంబంధిత అధికారులు సీసీ, ఏజీఎం, మేనేజర్ బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తూ తప్పుడు సమాచారంతో కూడిన స్టేట్‌మెంట్లు ఇచ్చారు. ఈ అవకతవకలపై గత నాలుగు నెలలుగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అనేకమార్లు అర్జీలు సమర్పించినప్పటికీ, క్షేత్రస్థాయిలో ఎటువంటి విచారణ జరగలేదు. అధికారుల చుట్టూ తిరుగుతున్నా తమకు న్యాయం జరగడం లేదు సరికదా, మమ్మల్ని మరింత ఇబ్బందులకు గురిచేస్తున్నారు. కావున వారిపై చర్యలు తీసుకోని స్త్రీ నిధి రుణాల చెల్లింపుల్లో జరిగిన అన్యాయంపై సమగ్ర విచారణ జరిపించి తమకు న్యాయం చేయాలని కోరారు. వీటితో పాటు పలువురు పింఛన్, రేషన్, ఇళ్ల నిర్మాణాల సమస్యలపై అర్జీలు ఇచ్చి పరిష్కరించాలని కోరగా.. మరికొందరు ఉద్యోగాల కోసం రెస్యూమ్ లు ఇచ్చారు. అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నాం ఆర్థికతోడ్పాటు కల్పించాలని మరికొందరు అభ్యర్థనలు అందించారు.

## బాలింతలు, గర్భిణీల ఆరోగ్యం పై ప్రత్యేక దృష్టి..

-జిల్లా కలెక్టర్ సిరి.


అధికారులతో కలసి పోష పక్వాడ పోస్టర్లను విడుదల చేస్తున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ సిరి

**డ్రీమ్స్ టైమ్స్ న్యూస్ మంత్రాలయం:**
బాలింతలు, గర్భిణులు, చిన్నారుల ఆరోగ్యం పై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ శ్రీ పేర్కొన్నారు. ఏప్రిల్ 9 నుండి 23 వరకు నిర్వహించబడుతున్న పోషణ పక్వాడా కార్యక్రమాల సందర్భంగా, అధికారులు కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి చేతుల మీదుగా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పోషణ పక్వాడా పోస్టర్లు విడుదల చేశారు. .
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి మాట్లాడుతూ, గర్భిణీలు, బాలింతలు మరియు చిన్నారుల పోషణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పోషణ పక్వాడా ద్వారా ప్రజల్లో పోషకాహారంపై అవగాహన పెంపొందించడం ఎంతో అవసరమని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని, సమతుల ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, సిబ్బందిపాల్గొన్నారు.


## ఆంధ్రజ్యోతి ఎడిటర్ పై మంత్రాలయం పోలీసు స్టేషన్ లో ఫిర్యాదు.



**మంత్రాలయం , ఏప్రిల్ 9(డ్రీమ్ టైమ్స్):**
డ్రీమ్స్ టైమ్స్ న్యూస్ :- వైఎస్సార్ సీపీ మనోభావాలను దెబ్బతీసేలా , మహిళలు అవమానంచేలా తప్పుడు దురుద్దేశపూరిత వార్తలు ప్రచురించిన ఆంధ్రజ్యోతి ఎండీ రాధాకృష్ణ పై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్సీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కమిటీ సభ్యులు, వైకాపా పార్టీ పత్తికొండ అసెంబ్లీ పరిశీలకులు సీతారామిరెడ్డి అన్నారు. గురువారం వైఎస్సార్ సీపీ పార్టీ ఆదేశాలు మేరకు మండల కేంద్రమైన మంత్రాలయం పోలీసు స్టేషన్ లో వైఎస్సార్ సీపీ మండలాధక్ష్యులు భీంరెడ్డి , వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి రాధాకృష్ణ పై ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని అవమానిస్తూ , మహిళల గౌరవాన్ని దిగజారే విధంగా వ్యవహాకరిస్తున్న వ్యక్తుల పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భీమయ్య , వైస్ ఎంపిపి పులకుక్క రాఘవేంద్ర మాజీ ఉప సర్పంచ్ హోటల్ పరమేష్ , నాయకులు జనార్దన్ రెడ్డి , ఎంపిటిసి వెంకటేష్ శెట్టి , వైఎస్సార్ సీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రాథమిక పాఠశాలలో బూజు పురుగులు పట్టిన చిక్కిలు పంపిణీ.

అనారోగ్యంలో విద్యార్థులు. తల్లిదండ్రుల ఆవేదన.



**శిరివెళ్ళ. (డ్రీమ్ టైమ్స్)**
ప్రాథమిక పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులకు బూజు పట్టి పురుగులు పట్టిన చిక్కిలు పంపిణీ చేస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. నాణ్యతలేని చిక్కిలు పంపిణీ చేయడం వల్ల చిన్నారులు అనారోగ్య పాలై ఆసుపత్రులకు వెళ్లాల్సిన పరిస్థితి ఎదురవుతున్నదని తెలియజేశారు. పర్యవేక్షణ లోపం కారణంగా పురుగులు పట్టిన చికీలు పంపిణీ చేస్తున్నారని విమర్శిస్తున్నారు. కడుపునొప్పి వాంతులు మోషన్స్ వంటి సమస్యలు తరచూ ఎదురవుతున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు తెలియజేశారు.

## మంత్రి టీజీ భరత్ గుప్తాను కలిసిన సీఐఐ చైర్మన్



**ఏప్రిల్ 9(డ్రీమ్ టైమ్స్):**
రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ గుప్తాను సీఐఐ ప్రతినిధులు కలిశాను. ఏపీ సీఐఐ చైర్మన్ ఎస్. నరేంద్ర కుమార్, వైస్ చైర్మన్ డాక్టర్ జి.సాంబశివరావు, సీనియర్ డైరెక్టర్ రాజేష్, విజయవాడ హెడ్ చందన్ మర్యాద పూర్వకంగా మంత్రిని కలిసి మాట్లాడారు. రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు సంబంధించి చర్చించారు.

## సమస్యల పరిష్కారానికె సర్వసభ్య సమావేశం .




**శిరివెళ్ళ. (డ్రీమ్ టైమ్స్)**
మండల పరిధిలోని ఆయా గ్రామాలలో నెలకొని ఉన్నటువంటి సమస్యల పరిష్కారానికి సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నామని మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు నాయక్ మహమ్మద్ వసీం పేర్కొన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ అభివృద్ధి కార్యాలయ సమావేశ భవనంలో ఎంపీడీవో సి శివ మల్లేశ్వరప్ప ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. రాబోయే రెండు నెలల్లో తరచూ అకాల వర్షాలు పెనుగాలులు ఉంటాయని వాటికి అనుగుణంగా రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని రానున్న ఖరీఫ్ లో ఆపరాల సాగుకు వ్యవసాయ శాఖ ప్రోత్సహిస్తున్నదని విత్తనాలు అందజేస్తుందని వ్యవసాయ అధికారి సుధాకర్ తెలియజేశారు. ఐసిడిఎస్ సిడిపిఓ తేజశ్వరి మాట్లాడుతూ శ్రీ శిశు సంక్షేమ అభివృద్ధి సంక్షేమ పథకాలు వారికి అందిస్తున్న పౌష్టిక ఆహార వసతులు వివరించారు. ఆర్డబ్ల్యూఎస్ ఏఈ త్రిలింగేశ్వర రెడ్డి మాట్లాడుతూ రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకొని నీటి ఎద్దడి సమస్య తలెత్తకుండా సమగ్రంగా ఎదుర్కొనేందుకు గ్రామపంచాయతీ కార్యదర్శులకు సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు., ఆయా ప్రభుత్వ శాఖల అధికారులు తమతమ నివేదికను చదివి వినిపించారు. వీరారెడ్డి పల్లి నుండి కోటపాడు వరకు గల రహదారిని మరియు శిరివెళ్ల నుండి చిన్న కంబలూరు మెట్ట వరకు గుంతల మయంగా ఉన్నటువంటి రహదారిని అభివృద్ధి చేయాలని ఆర్ అండ్ బి ఏఈ ని ఎంపీపీ వసీం ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ శాఖల అధికారులు ఎంపీటీసీలు ఇతర ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## దళితుడి ఇంటికి నిప్పు.



**శిరివెళ్ళ (డ్రీమ్ టైమ్స్)**
గ్రామంలో తలారి ఉద్యోగం పేరుతో జీతం తీసుకుంటూ బాధ్యతగా వ్యవహరించాల్సిన వ్యక్తి ఎస్సీ కాలనీలోని ఒక ఇంటికి నిప్పు పెట్టిన సంఘటన గురువారం ఉదయం సంచలనంగా మారింది.మండల పరిధిలోని బోయలకుంట్ల గ్రామంలో గల ఎస్సీ మాదిగ పేటలో బడితల సుధాకర్ అనే వ్యక్తికి చెందిన గుడిసెకు గ్రామానికి చెందిన తలారి నరసింహుడు నిప్పు పెట్టారని కాలనీవాసులు పేర్కొన్నారు. అర్ధరాత్రి సుమారు రెండు గంటల నుండి మాదిగ పేటలో ఉద్రిక్తత భయాందోళన వాతావరణం నెలకొన్నది. సుధాకర్ కు చెందిన గుడిసెలో వృద్ధురాలు అయిన తన తల్లి నివాసం ఉంటున్నట్లు నిప్పు పెట్టిన సమయంలో అమే లేదని తన తల్లి ఊరికి వెళ్ళినట్టు తెలియజేశారు. గుడిసెలోని సామాన్లు దుస్తులు ఇతర వస్తువులు కాళీ బూడిద అయ్యాయని తెలియజేశారు బోయలకుంట్ల గ్రామంలో ఉద్రిక్తత వాతావరణం నెలకొనడంతో శిరివెళ్ల పోలీసులు గ్రామానికి చేరుకొని అనుమానితుడైన తలారి నరసింహన్నీ పోలీస్ స్టేషన్ కు తీసుకు వచ్చినట్లు పేర్కొన్నారు.

# బిజినెస్

## భారత వృద్ధి రేటు అంచనా 6.6శాతం : ప్రపంచబ్యాంక్




**న్యూఢిల్లీ :**
2026-27 ఆర్థిక సంవత్సరంలో భారత వృద్ధి రేటు అంచనాలను స్వల్పంగా పెంచి 6.6 శాతానికి సవరించినట్లు ప్రపంచబ్యాంక్ తెలిపింది. ప్రారంభంలో జిఎస్‌టి రేట్ల తగ్గింపు వినియోగదారుల డిమాండ్‌ను పెంచినప్పటికీ పశ్చిమాసియా యుద్ధం కారణంగా తలెత్తే ప్రతికూల పరిస్థితులు వృద్ధిలో కోత విధించవచ్చని పేర్కొంది. 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వృద్ధి అంచనాలను ఆర్‌బిఐ 6.9శాతం, ఒఇసిడి 6.1శాతం, మూడీస్ రేటింగ్స్ 6శాతంగా అంచనా వేసిన సంగతి తెలిసిందే. ప్రపంచ బ్యాంక్ బుధవారం 'దక్షిణాసియా ఆర్థిక నివేదిక'ను విడుదల చేసింది. బలమైన దేశీయ డిమాండ్, ఎగుమతుల పటిష్టత కారణంగా, భారతదేశ వృద్ధి రేటు 2025లో నమోదైన 7.1శాతం నుండి 2026 ఆర్థిక సంవత్సరంలో 7.6శాతానికి వేగవంతమవుతుందని అంచనా వేసింది. తక్కువ ద్రవ్యోల్బణం, వస్తు సేవల పన్ను ( జిఎస్‌టి) క్రమబద్ధీకరణతో వ్యక్తిగత వినియోగ వృద్ధి వేగవంతమైందని పేర్కొంది. ”పశ్చిమాసియా యుద్ధం కారణంగా నెలకొన్న ప్రతికూలతల కారణంగా 2027 ఆర్థిక సంవత్సరంలో వృద్ధి 6.6శాతానికి తగ్గుతుందని అంచనా వేస్తున్నాము” అని నివేదిక పేర్కొంది.

# కుప్పకూలిన బంగారం ధరలు..

**-ఒక్కసారిగా బిగ్ క్రాష్.. లేటెస్ట్ ధరలు ఇవే..**

బంగారం కొనుగోలు చేయాలనుకునేవారికి భారీ గుడ్ న్యూస్. ధరలు గంటల వ్యవధిలోనే భారీగా తగ్గుదల నమోదు చేశాయి. ఒక్కసారిగా ధరలు పతనం కావడంతో కొనుగోలుదారులకు ఊరట కలిగినట్లయింది. హర్మూజ్ జలసంధిని తిరిగి మూసివేస్తున్నట్లు ఇరాన్ ప్రకటించిన క్రమంలో స్టాక్ మార్కెట్లు పతనమవుతున్నాయి. అలాగే బంగారం ధరలపై కూడా దీని ప్రభావం పడింది. గురువారం బంగారం రేట్లు క్రాష్ అవ్వగా.. లేటెస్ట్ ధరలు ఎలా ఉన్నాయో ఒకసారి చూద్దాం.హైదరాబాద్‌లో 10 గ్రాములు 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,51,480 వద్ద కొనసాగుతోంది. బుధవారం ఆ ధర రూ.1,53,820 వద్ద స్థిరపడింది. నిన్నటితో పోలిస్తే రూ.2340 తగ్గిపోయింది. ఇక 22 క్యారెట్ల ధర రూ.1,38,850గా ఉండగా.. నిన్న



రూ.1,41,000 వద్ద స్థిరపడింది. నిన్నటితో పోలిస్తే రూ.2150 పడిపోయింది.విజయవాడ, విశాఖపట్నంలో కూడా ఇవే ధరలు కొనసాగుతున్నాయి. ఇక చెన్నైలో 24 క్యారెట్ల గోల్డ్ రేటు రూ.1,52,730 వద్ద ఉండగా.. బుధవారం రూ.1,54,910గా ఉంది. నిన్నటితో పోలిస్తే రూ.2180 డౌన్ అయింది. ఇక 22 క్యారెట్ల ధర ఇప్పుడు రూ.1,40,000గా ఉండగా.. నిన్న రూ.1,42,000గా ఉంది. నిన్నటితో పోలిస్తే రూ.2 వేలు తగ్గిందని చెప్పవచ్చు.దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల బంగారం రేటు రూ.1,51,630 వద్ద ఉండగా.. నిన్న రూ.1,53,970గా ఉంది. ఇక 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,39,000గా ఉంది. నిన్న ఇది రూ.1,41,150 వద్ద స్థిరపడింది. ఇక బెంగళూరులో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం రేటు రూ.1,51,480 వద్ద ఉండగా.. ఇక 22 క్యారెట్ల రేటు రూ.1,38,850 వద్ద కొనసాగుతోంది.ఇక వెండి ధరలు కూడా పడిపోయాయి. బెంగళూరులో కేజీ వెండి రూ.2.55 లక్షలుగా ఉంది. నిన్న రూ.2.60 లక్షలుగా ఉంది. ఇక హైదరాబాద్‌లో ప్రస్తుతం రూ.2.60 లక్షలుగా ఉంది. నిన్న రూ.2.65 లక్షల వద్ద స్థిరపడింది.

# డిస్నీలో 1,000 మంది ఉద్యోగులపై వేటు..

**వాషింగ్టన్**
ప్రముఖ వినోద రంగ దిగ్గజం వాల్ట్ డిస్నీ రానున్న వారాల్లో సుమారు 1,000 మంది ఉద్యోగులను తొలగించాలని యోచిస్తున్నట్లు వాల్ స్ట్రీట్ జర్నల్ నివేదించింది. ఈ తొలగింపులు ప్రధానంగా కంపెనీ మార్కెటింగ్ విభాగంపై ప్రభావం చూపనున్నాయి. గత మార్చిలో డిస్నీ సిఇఒగా జోష్ డి అమరో బాధ్యతలు చేపట్టకముందే ఈ కోతలకు సంబంధించిన ప్రణాళికలు మొదలైనట్లు సమాచారం. ప్రస్తుతం డిస్నీలో దాదాపు 2,31,000 మంది ఉద్యోగులు ఉండగా.. తాజా నిర్ణయం మొత్తం సిబ్బందిలో 1 శాతం కంటే తక్కువ మందిపై ప్రభావం చూపనుంది. కంపెనీ ఖర్చులను తగ్గించుకోవడంలో భాగంగా ప్రాజెక్ట్




# చెన్నై జట్టును తక్కువ అంచనా వేయలేం

**సన్‌రైజర్స్ స్టార్ బ్యాటర్ హెన్రిచ్ క్లాసెన్**

ఐపీఎల్ 2026 సీజన్ రసవత్తరంగా సాగుతోంది. ఇప్పటికే 13 మ్యాచ్‌లు ముగియగా, జట్ల మధ్య పోరు హోరాహోరీగా మారుతోంది. ఈ క్రమంలో ఏప్రిల్ 18న హైదరాబాద్‌లోని ఉప్పల్ మైదానంలో సన్‌రైజర్స్ హైదరాబాద్ , చెన్నై సూపర్ కింగ్స్ జట్ల మధ్య బిగ్ ఫైట్ జరగనుంది. అయితే ఈ మ్యాచ్‌కు ముందు అందరి ఫోకస్ ఎంఎస్ ధోనీపైనే ఉంది. గాయం కారణంగా ధోనీ ఈ సీజన్‌లో ఇప్పటివరకు ఒక్క మ్యాచ్ కూడా ఆడలేదు. ఈ నేపథ్యంలో సన్‌రైజర్స్ స్టార్ బ్యాటర్ హెన్రిచ్ క్లాసెన్ చెన్నై జట్టుపై చేసిన కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ధోనీ లేకపోవడం సీఎస్‌కే బలాన్ని తగ్గిస్తుందని తాను భావించడం లేదని క్లాసెన్ స్పష్టం చేశారు. చెన్నై సూపర్ కింగ్స్ జట్టుకు ఐపీఎల్‌లో అద్భుతమైన రికార్డు ఉందని, వారు ఎప్పుడూ పటిష్ఠమైన జట్టుగానే బరిలోకి దిగుతారని హెన్రిచ్ క్లాసెన్ పేర్కొన్నారు. “ధోనీ మైదానంలో లేనంత మాత్రాన ఆ జట్టు బలహీనపడదు. వారి సెటప్‌లో ఉన్న ప్రతి ఆటగాడు ప్రతిభావంతుడే. విదేశీ



ఆటగాళ్లతో పాటు స్వదేశీ కుర్రాళ్లు కూడా మ్యాచ్‌ను గెలిపించగలరు” అని క్లాసెన్ అభిప్రాయపడ్డారు. జియోస్టార్ ప్రెస్ రూమ్‌లో జరిగిన ఇంటర్వ్యూలో ఆయన సీఎస్‌కే జట్టుపై తనకున్న గౌరవాన్ని చాటుకున్నారు. ధోనీ లేకపోవడం వల్ల తమ పని సులభం అవుతుందని తాము అనుకోవడం లేదని ఆయన తెలిపారు.చెన్నై సూపర్ కింగ్స్ జట్టును మరో కీలక ఆటగాడి రాకతో మరింత బలం పెరిగినట్లయ్యింది. దక్షిణాఫ్రికా యువ సంచలనం డెవాల్డ్ బ్రెవిస్ గాయం నుంచి కోలుకుని జట్టుతో చేరబోతున్నాడని క్లాసెన్ వెల్లడించారు. ధోనీలాగే బ్రెవిస్ కూడా ప్రాక్టీస్ సెషన్‌లో గాయపడటం వల్ల మొదటి మూడు మ్యాచ్‌లకు దూరమయ్యాడు. బ్రెవిస్ మిడిల్ ఆర్డర్‌లో వస్తే చెన్నై బ్యాటింగ్ మరింత బలోపేతం అవుతుందని, అది తమ బౌలర్లకు సవాల్‌గా మారుతుందని క్లాసెన్ చెప్పుకొచ్చారు. క్లాసెన్ తన సొంత దేశపు ఆటగాడైన బ్రెవిస్ సామర్థ్యం గురించి మేనేజ్‌మెంట్‌ను హెచ్చరించారు.చెన్నై జట్టు టాప్ ఆర్డర్ గురించి మాట్లాడుతూ క్లాసెన్ ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. ప్రస్తుత కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్, కొత్తగా జట్టులో చేరిన సంజు శామ్సన్ ఇప్పటివరకు ఆశించిన స్థాయిలో పరుగులు చేయలేదు. అయితే ఇలాంటి క్లాస్ ప్లేయర్లు ఎప్పుడైనా ఫామ్ అందుకునే అవకాశం ఉందని, వారు ఫామ్ లోకి వస్తే ఆపడం చాలా కష్టమని అన్నారు. వారు తమపై జరిగే మ్యాచ్‌లో కూడా ఫెయిల్ కావాలని తాము కోరుకుంటున్నామని, తద్వారా చెన్నైని ఒత్తిడిలోకి నెట్టవచ్చని క్లాసెన్ నవ్వుతూ వ్యాఖ్యానించారు.

# స్పోర్ట్స్

## క్వార్టర్ ఫైనల్లో ఆయుశ్.. తొలి రౌండ్‌లోనే సింధు, ప్రణయ్ ఇంటికి..!




భారత యువ షట్లర్ ఆయుష్ శెట్టి అదుర్స్ అనిపించాడు. ప్రతిష్ఠాత్మక బ్యాడ్మింటన్ ఆసియా ఛాంపియన్‌షిప్స్ లో సీనియర్లు తేలిపోగా.. ఈ కుర్రాడు మాత్రం క్వార్టర్ ఫైనల్‌కు దూసుకెళ్లాడు. గురువారం చీ యు జెన్(చైనీస్ తైపీ)ను చిత్తు చేసిన ఆయుశ్ టైటిల్‌పై ఆశలు రేపుతూ క్వార్టర్స్‌లో అడుగుపెట్టాడు. పురుషుల సింగిల్స్‌లో హెచ్‌హెచ్ ప్రణయ్ చేతెలెత్తేయగా.. మహిళల సింగిల్స్‌లో పీవీ సింధు సైతం మొదటి రౌండ్‌లో ఓటమితో ఇంటిదారి పట్టింది.చైనా వేదికగా జరుగుతున్న బ్యాడ్మింటన్ ఆసియా ఛాంపియన్‌షిప్స్‌లో గురువారం భారత్‌కు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. ఫేవరెట్‌గా బరిలోకి దిగిన పీవీ సింధు తొలి రౌండ్‌లో, హెచ్ఎస్ ప్రణయ్ క్వార్టర్స్‌కు ముందే నిష్క్రమించారు.ఆల్ ఇంగ్లండ్ ఛాంపియన్‌షిప్ ఆడలేకపోయిన సింధు ఈ టోర్నీలో మెరుస్తుందనుకుంటే.. వరల్డ్ నంబర్ 2 ధాటికి మొదటి రౌండ్‌లోనే పరాజయం పాలైంది. రెండు సెట్లలో పోరాడిన తెలుగు తేజాన్ని వాంగ్ జీ యీ 21-18, 21-18తో మట్టికరిపించింది. తొలి రౌండ్‌లో అదరగొట్టిన ప్రణయ్‌ను చైనా షట్లర్ వెంగ్ హాంగ్ యాంగ్ 21-12, 21-19తో సులువుగా ఓడించాడు.

**ఆయుశ్ తగ్గేదేలే..**
సీనియర్లు విఫలమైన చోట ఇరవై ఏళ్ల ఆయుశ్ ప్రత్యర్థికి దడ పుట్టించాడు. తొలి రౌండ్‌లోనే ఏడో ర్యాంకర్ చైనా ఆటగాడిని ఇంటికి పంపిన ఆయుశ్ ఈసారి 25వ ర్యాంకరైన చీ యూ జెన్(చైనీస్ తైపీ)ను వణికించాడు. మ్యాచ్ ఆరంభం నుంచి ఆధిపత్యం చెలాయించిన భారత కుర్రాడు.. 21-16, 21-12తో గెలుపొందాడు. క్వార్టర్స్‌లో అతడికి మూడో సీడ్ జోనాథన్ క్రిస్టీ(ఇండోనేషియా) ఎదురుపడనున్నాడు. ఆయుష్ సెమీస్ చేరాలంటే జోనాథన్ వ్యూహాలను చిత్తు చేయాల్సిందే.

# ఐపీఎల్‌లో సరికొత్త రూల్!

సాధారణంగా ఐపీల్ మ్యాచ్‌ల సమయంలో డగౌట్‌లో ఉండే ఆటగాళ్లు పదే పే మైదానంలోకి రావడం చూస్తూనే ఉంటాం. డ్రింక్స్ అందించడానికో, బ్యాట్లు మార్చడానికో, లేదా కోచ్ చెప్పే సమాచారాన్ని చేరవేయడానికో వస్తూ ఉంటారు. అయితే దీని వల్ల మ్యాచ్ సమయం వృథా అవుతుందని గ్రహించిన బీసీసీ సరికొత్త రూల్స్ తీసుకొచ్చింది. ఇందులో భాగంగా మ్యాచ్ ప్లేయింగ్ కండిషన్స్‌లో మార్పులు చేసింది. బీసీసీఐ తాజాగా ఫ్రాంచైజీలకు పంపిన సమాచారం ప్రకారం... మ్యాచ్ ప్రారంభానికి ముందు ఇచ్చిన టీమ్ షీట్‌లో చెప్పిన 16 మంది ఆటగాళ్లకు మాత్రమే అంటే 11మంది జట్టు సభ్యులు ఐదుగురు సబ్‌స్టిట్యూట్లకు మాత్రమే మైదానంతో సంబంధం ఉంటుంది. ఈ 16 మందిలో లేని మిగతా స్క్వాడ్ సభ్యులలు ఎవరూ కూడా ఆట జరుగుతున్న సమయంలో మైదానంలోకి అడుగు పెట్టడానికి లేదు. సాధారణంగా రిజర్వ్ ప్లేయర్లు డ్రింక్స్ లేదా సమాచారాన్ని తీసుకెళ్తుంటారు. కానీ కొత్త రూల్స్ ప్రకారం టీమ్ షీట్‌లో లేని ఆటగాళ్లు డ్రింక్స్, బ్యాట్లు




లేదా ఎలాంటి సందేశాలు పట్టుకొని రావడానికి లేదు. మ్యాచ్ జరుగుతున్న టైంలో కేవలం ఐదుగురు సబ్‌స్టిట్యూట్ ఆటగాళ్లు మాత్రమే మైదానం చుట్టూ తిరగడానికి అనుమతి ఉంటుంది. మిగిలిన వారు కచ్చితంగా డగౌట్‌కే పరిమితం కావాలి. వారు బౌండరీ లైన్, ఎల్ఈడీ అడ్వర్టైజింగ్ బోర్డుల మధ్య తిరగడానికి లేదు. మైదానం లోపల లేదా బౌండరీ పరిసరాల్లో ఉండే సబ్‌స్టిట్యూట్ ఆటగాళ్లు కచ్చితంగా టీమ్ ట్రైనింగ్ బిబ్స్ ధరించాలి. ఇది వారి ఆడుతున్న ఆటగాళ్ల నుంచి వేరుగా గుర్తించడానికి సహాయపడుతుంది. ఈ కొత్త మార్పులు ఇప్పటికే ఉన్న మ్యాచ్ ప్లేయింగ్ కండిషన్స్‌లోని క్లాజ్ 11.5.2, 24. 1.4లకు అదనంగా చేర్చారు. క్లాజ్ 11.5.2 ప్రకారం వికెట్ పడినప్పుడు లేదా బౌండరీ వద్ద మాత్రమే సమయం వృథా కాకుండా డ్రింక్స్ అందించాలి. అంపైర్ల అనుమతి లేకుండా కూల్స్ డ్రింక్స్ మైదానంలోకి తీసుకురాకూడదు. క్లాజ్ 24.1.4 ప్రకారం మ్యాచ్‌లో ఆడని ఆటగాళ్లు మైదాన ప్రాంతంలో ఉన్నప్పుడు తప్పనిసరిగా బిబ్స్ ధరించాలని స్పష్టం చేస్తుంది. ఈ రూల్ వల్ల జట్ల వ్యూహాలై ప్రభావం పడే అవకాశం ఉంది. ముఖ్యంగా క్లిష్ట సమయంలో డగౌట్ నుంచి ఆటగాళ్లు సందేశాలు పంపడం ఇప్పుడు కొంత కష్టతరం కావచ్చు. కేవలం నిర్ణీత 16 మంది ద్వారానే కమ్యూనికేషన్ జరగాల్సి ఉంటుంది. ఇప్పటికే ఈ ఆదేశాలను ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ అన్ని ఫ్రాంచైజీలకు చేరవేసింది.




# రూ.900 కోట్ల భారీ బడ్జెట్‌తో 'రాకా'...

## అల్లు అర్జున్‌తో పాటు మిగతా వారికి రెమ్యునరేషన్ ఎంతంటే..!

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ -- స్టార్ దర్శకుడు అట్లీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న 'రాకా' సినిమా ఫస్ట్ లుక్ విడుదలైనప్పటి నుంచి హాట్ టాపిక్‌గా మారింది. ముఖ్యంగా ఈ చిత్రానికి సంబంధించిన భారీ పారితోషికాలు ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారాయి.ఈ సినిమా బడ్జెట్ దాదాపు రూ.800 నుంచి 900 కోట్ల వరకు ఉంటుందని సినీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. ఈ స్థాయిలో భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న చిత్రానికి సంబంధించిన పారితోషికాలు కూడా ఇప్పుడు పెద్ద చర్చగా మారాయి. హీరో అల్లు అర్జున్ ఈ ప్రాజెక్ట్ కోసం రూ.175 కోట్ల రెమ్యునరేషన్‌తో పాటు లాభాల్లో 15 శాతం వాటాను తీసుకుంటున్నట్లు సమాచారం. దీంతో ఈ సినిమా విజయవంతమైతే ఆయన మొత్తం సంపాదన రూ.300 కోట్లకు పైగా వెళ్లే అవకాశముందని విశ్లేషణలు చెబుతున్నాయి.ఇక దర్శకుడు అట్లీ కూడా తన స్థాయికి తగ్గట్టుగా భారీ పారితోషికం తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. 'జవాన్' వంటి బ్లాక్‌బస్టర్ విజయానంతరం ఆయన ఈ సినిమాకు దాదాపు రూ.100 కోట్ల వరకు డిమాండ్ చేసినట్లు టాక్. బాలీవుడ్ స్టార్ హీరోయిన్ దీపికా పదుకొణె ఈ చిత్రంలో కీలక పాత్ర పోషిస్తున్నట్టు సమాచారం. ఆమెకు రూ.20 నుంచి 25 కోట్ల వరకు పారితోషికం అందుతున్నట్లు తెలుస్తోంది. అలాగే నేషనల్ క్రష్‌గా గుర్తింపు పొందిన రష్మిక మందన్న ఈ సినిమాలో నెగటివ్ షేడ్స్ ఉన్న పాత్రలో కనిపించబోతుండటం విశేషం. ఈ పాత్ర కోసం ఆమెకు రూ.5 నుంచి 7 కోట్ల వరకు పారితోషికం అందుతుందని సినీ వర్గాలు చెబుతున్నాయి.భారీ తారాగణం, హై టెక్నికల్ వాల్యూస్, అట్లీ స్టైల్ మాస్ ఎలిమెంట్స్ అన్నీ కలిపి 'రాకా'ను ఒక విజువల్ వండర్‌గా తీర్చిదిద్దుతున్నట్లు తెలుస్తోంది. ఫస్ట్ లుక్‌తోనే భారీ అంచనాలు పెంచుకున్న ఈ చిత్రం విడుదలకు ముందే ఇండస్ట్రీలో రికార్డుల చర్చ మొదలైంది. విడుదలైన తర్వాత బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డులు సృష్టించడం ఖాయమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మొత్తంగా చూస్తే, అల్లు అర్జున్ -- అట్లీ కాంబోలో రాబోతున్న 'రాకా' సినిమా భారతీయ సినీ చరిత్రలోనే అత్యంత భారీ ప్రాజెక్ట్‌లలో ఒకటిగా నిలవబోతోందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. టాలీవుడ్‌లో భారీ అంచనాల మధ్య రూపొందుతున్న తాజా చిత్రం రాకా అల్లు అర్జున్ హీరోగా, బ్లాక్‌బస్టర్ దర్శకుడు అట్లీ దర్శకత్వంలో తెరకెక్కుతోంది. అల్లు అర్జున్ 44వ పుట్టినరోజు సందర్భంగా విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్ ఇప్పటికే సోషల్ మీడియాలో సంచలనం సృష్టించింది.

# పెద్దితో ఆటపాట?



ఇటీవల వచ్చిన 'కపుల్ ఫ్రెండ్లీ' చిత్రంలో చక్కటి అభినయంతో ప్రేక్షకుల్ని మెప్పించింది హైదరాబాదీ సొగసరి మానస వారణాసి. ప్రస్తుతం ఈ భామకు టాలీవుడ్‌లో మంచి ఆఫర్లొస్తున్నట్లు తెలిసింది. ఇదిలావుండగా రామ్‌చరణ్ 'పెద్ది' చిత్రంలో ఈ అమ్మడు ఓ ఐటెంసాంగ్‌లో నర్తించనుందని వార్తలు వినిపిస్తున్నాయి. తొలుత ఈ ప్రత్యేకగీతం కోసం మృణాల్ ఠాకూర్‌ను సంప్రదించారని, డేట్స్‌లేని కారణంగా ఆమె తిరస్కరించిందని సమాచారం. ఈ నేపథ్యంలో ఈ స్పెషల్‌సాంగ్ కోసం చిత్రబృందం యంగ్ హీరోయిన్‌ను ఎంపిక చేసే ప్రయత్నాల్లో ఉందట. ఇప్పటికే మానస వారణాసితో సంప్రదింపులు పూర్తయ్యాయని అంటున్నారు. అయితే ఈ వార్తలో నిజానిజాలెంతో తెలియాలంటే మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సిందే. బుచ్చిబాబు సానా దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న 'పెద్ది' చిత్రం ఒక్కపాట మినహా షూటింగ్‌ను పూర్తిచేసుకుంది. ఈ నెల 30న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకురానుంది.

# గత్తర లేపిన ప్రియా ప్రకాష్..

## అందాలతో కవ్విస్తున్న కుర్ర భామ

ఒక చిన్న కన్నుగీటే సన్నివేశంతో యావత్ భారతదేశాన్ని తనవైపు తిప్పుకుంది కేరళ కుట్టి ప్రియా ప్రకాశ్ వారియర్. ఇంకా చెప్పాలంటే కేవలం ఒక్క రాత్రిలోనే సెలబ్రిటీ హోదాను సొంతం చేసుకుందీ బ్యూటీ. 'ఒరు ఆదర్ లవ్' సినిమాలోని సెకన్ల వ్యవధిలో ఉన్న ఆ వీడియో అప్పట్లో నెట్టింట్లో సంచలనంగా మారింది.ఇక ఈ వీడియో వైరల్ అయిన తర్వాత ప్రియాకు సినిమా అవకాశాలు వరుసపెట్టి క్యూ కట్టాయి. టాలీవుడ్ నుంచి బాలీవుడ్ వరకు ప్రియాకు ఆఫర్లు వెల్లువెత్తాయి. అయితే ప్రియా మాత్రం ఆచితూచి సినిమాలు ఎంపిక చేసుకుంటోంది. నితిన్ హీరోగా తెరకెక్కిన 'చెక్' సినిమా చేసింది.చెక్ సినిమా ఆశించిన స్థాయిలో విజయం సాధించలేకపోయింది. చెక్ సినిమా తర్వాత తిరిగి మలయాళంలో బిజీగా మారింది. తెలుగులో చాలా కాలం తర్వాత మెగా మల్టీస్టారర్ మూవీ బ్రో సినిమాలో నటించింది. కానీ ఈ సినిమా కూడా డిజాస్టర్ అయ్యింది. దాంతో తెలుగులో ఈ అమ్మడు పెద్దగా కనిపించడం లేదు.ఇటీవల, ఆమె "గుడ్ బ్యాడ్ అగ్లీ" చిత్రంలో అజిత్ కుమార్‌తో కలిసి నటించింది. ఈ సినిమాలో కీలక పాత్రలో నటించింది. అలాగే బాలీవుడ్‌లో "త్రీ మంకీస్", "లవ్ హ్యాకర్స్", కన్నడ చిత్రం "విష్ణు ప్రియ" వంటి ప్రాజెక్టుల్లో నటించింది. ఇక ఈ బ్యూటీ సినిమాలతో కంటే సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటుంది.సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ, తన క్రేజీ ఫోటోషూట్‌లు, డ్యాన్స్ వీడియోలతో అభిమానులను అలరిస్తుంది. తాజాగా ఈ బ్యూటీ షేర్ చేసిన ఫోటోలు వైరల్ గా మారాయి. ఈ పిక్స్ కు నెటిజన్స్ క్రేజీ కామెంట్స్ చేస్తున్నారు.



# డెకాయిట్ బ్లాక్ బస్టర్ అందుకోవాలి

## సుప్రియను అభినందిస్తూ సమంత పోస్ట్



కొన్ని రోజుల నుంచి సోషల్ మీడియాలో 'డెకాయిట్' సందడి కనిపిస్తోంది. అడివి శేష్ హీరోగా షానియల్ డియో తెరకెక్కించిన ఈ చిత్రం ఏప్రిల్ 10న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో టీమ్‌కు అందరూ ఆల్ ది బెస్ట్ చెబుతున్నారు. తాజాగా నటి సమంత టీమ్‌పై ప్రశంసలు కురిపించారు. ఈ చిత్ర నిర్మాత సుప్రియను ఉద్దేశించి ఇన్‌స్టాలో స్టోరీ పెట్టారు. 'సుప్రియ.. 'డెకాయిట్' కోసం నువ్వు పడిన కష్టం, నీ పట్టుదల, సినిమాపై నీకున్న అంకితభావం అన్నీ నేను స్వయంగా చూశాను. బ్లాక్‌బస్టర్ విజయాన్ని అందుకోవడానికి నీకంటే ఎవరూ అర్హులు కారు. దేవుడి ఆశీస్సులు నీకు ఎప్పుడూ ఉండాలి' అని సమంత అన్నారు. 'డెకాయిట్' విజయం సాధించాలని కోరుకుంటూ టీమ్‌కు ముందుగానే శుభాకాంక్షలు తెలిపారు. రొమాంటిక్ యాక్షన్ థ్రిల్లర్ నేపథ్యంలో ఈ సినిమా తెరకెక్కింది. శేష్ సరసన మృణాల్ నటించగా.. బాలీవుడ్ నటుడు, దర్శకుడు అనురాగ్ కశ్యప్ విలన్‌గా కనిపించనున్నారు. విడుదల తేదీ ప్రకటించిన నాటినుంచి చిత్రబృందం జోరుగా ప్రచారం చేసి సినిమాపై ఆసక్తిని రెట్టింపు చేసింది. టీజర్, ట్రైలర్ ఆకట్టుకునేలా ఉండడంతో దీనిపై అంచనాలు నెలకొన్నాయి.

# హన్సిక కుటుంబ వివాదం కోర్టుకు..

## వదినపై రూ.2 కోట్ల పరువు నష్టం దావా



సినీ నటి హన్సిక కుటుంబంలో నెలకొన్న అంతర్గత విభేదాలు ఇప్పుడు బహిరంగంగా కోర్టు మెట్లెక్కాయి. తనపైనా, తన కుటుంబంపైనా తప్పుడు ఆరోపణలు చేస్తూ ప్రతిష్టను దెబ్బతీస్తున్నారని ఆరోపిస్తూ హన్సిక తన వదిన నాన్సీ జేమ్స్‌పై రూ.2 కోట్ల పరువు నష్టం దావా వేశారు. ఈ వ్యవహారం ప్రస్తుతం సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. హన్సిక సోదరుడు ప్రశాంత్ మోత్వానీ భార్య నాన్సీ జేమ్స్ గతంలో సోషల్ మీడియా వేదికగా తన అత్తగారి కుటుంబంపై తీవ్ర ఆరోపణలు చేశారు. గృహహింస, మానసిక వేధింపులు ఎదుర్కొన్నానని ఆమె పలుమార్లు పేర్కొన్నారు. ఈ ఆరోపణలు ఒక్కసారిగా సంచలనం సృష్టించాయి.అయితే ఈ ఆరోపణలను హన్సిక తీవ్రంగా ఖండించారు. కేవలం డబ్బు వసూలు చేయాలనే ఉద్దేశంతోనే నాన్సీ ఇలా తప్పుడు ప్రచారం చేస్తున్నారని కోర్టులో తెలిపారు. తమ స్టార్ ఇమేజ్‌ను ఉపయోగించుకుని అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఆరోపించారు. ఇన్నాళ్లు ఈ వివాదంపై మౌనంగా ఉన్నానని, కానీ పరిస్థితులు హద్దులు దాటడంతో న్యాయపోరాటానికి దిగాల్సి వచ్చిందని హన్సిక పేర్కొన్నారు. సోషల్ మీడియాలో నాన్సీ చేసిన వీడియోలు, కామెంట్లు తన తల్లి గౌరవాన్ని దెబ్బతీశాయని, కుటుంబం మానసికంగా ఇబ్బందులు పడుతోందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కేసును విచారించిన కోర్టు నాన్సీ జేమ్స్‌కు కీలక ఆదేశాలు జారీ చేసింది. హన్సిక కుటుంబంపై అవమానకర వ్యాఖ్యలు చేయవద్దని, ఇప్పటికే సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన వివాదాస్పద వీడియోలను వెంటనే తొలగించాలని స్పష్టం చేసింది. ఈ ఆదేశాలు కేసు ప్రాధాన్యతను మరింత పెంచాయి. హన్సిక సోదరుడు ప్రశాంత్ మోత్వాని కూడా ఈ వివాదంలో తన సోదరికి అండగా నిలిచారు. తన భార్య చేసిన ఆరోపణల్లో నిజం లేదని ఆయన పేర్కొన్నారు. వివాహం తర్వాత కొద్దికాలానికే తమ మధ్య విభేదాలు మొదలయ్యాయని, ఇప్పుడు అవి కుటుంబ స్థాయికి చేరుకున్నాయని తెలుస్తోంది. హన్సిక తరపు న్యాయవాదులు ఈ వ్యవహారాన్ని వ్యాపార ప్రయోజనాలు లేదా వ్యక్తిగత కక్షల కోణంలో చూస్తున్నారు. నాన్సీ కావాలనే వివాదాన్ని పెద్దదిగా చేస్తున్నారని వాదిస్తున్నారు. ఇక కోర్టు తుది తీర్పు వచ్చే వరకు ఈ వ్యవహారం మరింత మలుపులు తిరిగే అవకాశముంది. హన్సిక కోరిన రూ.2 కోట్ల పరిహారం, అలాగే భవిష్యత్తులో నాన్సీ చేసే వ్యాఖ్యలపై కోర్టు నిర్ణయం కీలకంగా మారనుంది.

Printer. Publisher and owned by Dr k Soumya, and printed it kalanjali offset printers, shop no.23, sowjanya complex, N.K road , Srinivas Nagar, nandyal-518501 shop no 7, Sai revenue complex, mro office complex, nandyal town -518501 nandyal district (AP) editor: Dr k Sowmya. Email: editor@dream Times.in, editor@dream Times.co.in, cell:8500066609,RNI NO:APTEL 2021/81831